News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :136 | ఖమ్మం | గురువారం, జూన్ 25, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

### తుంగభద్ర జలాల్లో తెలంగాణకు
# అన్యాయం

- కర్నాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరు ఎడారి
- ఆర్డీఎస్, తుమ్మిళ్ల ప్రాజెక్టుల ప్రయోజనాలు కాపాడాలి
- నీటి వాటాల కోసమే తెలంగాణ పోరాడి గెలిచింది
- కర్నాటక దురాగతాలను అడ్డుకోకుంటే మళ్లీ పోరాటమే
- సీఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ



తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. 'సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి,

వివరాలు 2లో..

# సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

రాష్ట్రంలో రేపటి నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా పేదలు, బడుగు బలహీన వర్గాలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇవాళ జరిగిన జూమ్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, బీఎల్‌ఏలు, సర్పంచ్‌లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించడంతో పాటు ప్రతి అర్హత గల ఓటును కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

- నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించం
- పార్టీకోసం పనిచేయని వారిని వదులుకుంటాం
- బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం
- సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది
- జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్ ఘాటు హెచ్చరిక

ఎస్ఐఆర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు. తెలంగాణలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని,

వివరాలు 2లో..



### తుంగభద్ర, ఆర్డీఎస్‌లపై సిఎం రేవంత్ సమీక్ష

- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అధికారులు
- సమీక్షలో పాల్గొన్న మంత్రులు, అధికారులు

జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఇటీవల కర్నాటక వివిధ ప్రాజెక్టును కడుతున్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో తుంగభద్ర జలాల్లో మన వాటా విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ క్రమంలో సిఎం దీనిపై సమీక్షించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, ఇరిగేషన్ సెక్రెటరీ శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు సమీక్షలో

వివరాలు 2లో..

### తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవం
# బోనాల పండుగ

- గతంలో ఒకే కార్పోరేషన్ పరిధిలో ఆషాఢ బోనాలు
- ఈ యేడు మూడు కార్పోరేషన్ల పరిధిలో నిర్వహణ
- అన్ని శాఖలు సమన్వయంతో బోనాలను విజయవంతం చేయాలి
- భక్తులకు సౌకర్యాల కల్పనతో పటిష్ట చర్యలు చేపట్టాలి
- ఆషాఢమాస బోనాల సమన్వయ సమావేశంలో మంత్రి కొండా సురేఖ
- బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయింపు



తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, జానపద వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రస్తుతం లండన్‌లో పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ గారు బుధవారం జూమ్ వేదికగా ఎంసిఆర్ హెచ్ఆర్ డిలో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొని ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, దానం నాగేందర్, డిజిపి సి.వి. ఆనంద్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఉన్నతాధికారులు, జీహెచ్ఎంసీ, పోలీసు, విద్యుత్, ఆర్/బీ, వాటర్ వర్క్స్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, ఆర్టీసీ, మెట్రో, పర్యాటక,

వివరాలు 2లో..

# నేటి నుంచే తెలంగాణలో 'సర్'

- జులై 24 వరకు ఇంటింటి సర్వే
- 3,38,26,448 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలు ఇవ్వనున్న బీఎల్‌వోలు
- హైదరాబాద్‌లో ఇంగ్లిష్‌లో, మిగతా జిల్లాల్లో తెలుగులో పత్రాల అందజేత

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్–సర్)కు రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో గురువారం సర్వే ప్రక్రియ ప్రారంభం కానుంది. జులై 24 వరకు కొనసాగనుంది. సర్వేకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాల వారీగా ఒక్కో ఓటరు పేరుతో రెండు ఎన్యూమరేషన్ పత్రాలను ముద్రించి సిద్ధంగా పెట్టుకున్నారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఇంగ్లిష్‌లో, మిగతా జిల్లాల్లో తెలుగులో పత్రాలను అందిస్తారు. బీఎల్‌వోలు ప్రతిరోజు కనీసం ఒక్కో బూత్ పరిధిలో 50 ఇళ్లకు వెళ్లి ఓటర్లకు వాటిని అందజేయాలి. రాష్ట్రంలో ఉన్న మొత్తం 3,38,26,448 ఓటర్లకూ వాటిని ఇవ్వాలి. ఓటర్లు వాటిని పూర్తి చేసి వచ్చే నెల 24లోపు బీఎల్‌వోలకు అందించాలి. ఇప్పటికే బీఎల్‌వోలకు మండలాల వారీగా సమగ్రంగా శిక్షణ ఇచ్చారు.

**ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో..**

బీఎల్‌వోలు ప్రతి ఇంటినీ కనీసం మూడుసార్లు సందర్శిస్తారు. ఓటరుకు రెండు ఎన్యూమరేషన్

వివరాలు 2లో..



## వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు

ప్రధాని మోదీని ఆహ్వానించిన ఇరాన్



ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ దివంగత ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీకి ఆహ్వానం అందింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు ఘనంగా జరగబోతున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆహ్వానించారు. జులై 5 నుంచి 9వ తేదీ వరకు

వివరాలు 2లో..

# నల్లగొండకు సిటీ బస్సు సర్వీసులు

లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండలో సిటీ బస్సు సేవలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు షాపింగ్, ఇతర అవసరాల కోసం రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆస్పత్రికి చేరుకోవడానికి ఆటోలపై ఆధారపడాల్సి వచ్చేదని, ఇకపై వారు సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం

వివరాలు 2లో..

# విద్యుత్ శాఖలో స్కాం.. త్వరలో బయటపెడతాం: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్: హైబ్రిడ్ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కిందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. స్కీములు లేవు కానీ.. రోజుకో స్కాం వెలుగు చూస్తోందన్నారు. పీఎం కుసుమ్ పథకంలో రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి కాంగ్రెస్ నేతలు తెరతీశారని ఆయన ఆరోపించారు. విద్యుత్ శాఖలో మరో స్కాంను త్వరలో బయట పెడతామన్నారు.

"వడ్ల కొనుగోళ్లు పూర్తయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గం. మిగిలిన వడ్లు మొత్తం కొనుగోలు చేయాలి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌కు పీఏగా పనిచేస్తున్నారా? మోదీ, చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, జనసేన అన్నీ ఒకటే టీమ్. మ్యాచ్ ఫిక్సింగ్ డ్రామాలు తప్ప ఏమీలేదు" అని జగదీశ్‌రెడ్డి విమర్శించారు.

## అయోధ్య రామయ్యా.. ఏమిటీ అపచారం !

అందరి బంధువయ్యా...అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకులను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పుడే మరచిపోలేదు.అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాల ను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యా యన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి. మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలోఅడుగుడగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయినే చెప్పాలి. ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్థపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరి స్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషపడుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావా లను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మరోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది.ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టబోమంటూ హామీనిచ్చారు. మొత్తంగా రాముడి పేరు చెప్పి నిర్వాహకులే టోపీ పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చగా మారింది.

# సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

మొదటిపేజీ తరువాయి..

దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే సర్ విషయంలో సీరియస్‌గా లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఆగ్రహం చెందారు సర్ పేరిట బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్‌గా ఉన్న మరోవ్యక్తిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు.



తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు. సర్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. ఈ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లో వీక్‌గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని మీనాక్షి నటరాజన్ అన్నారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

## తుంగభద్ర, ఆర్డీఎస్‌లపై సిఎం రేవంత్ సమీక్ష

మొదటిపేజీ తరువాయి..

పాల్గొన్నారు. తుంగభద్ర పైన నీటిపారుదల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు..రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న ఆందోళన నెలకొంది. రాయచూర్ జిల్లాలో 2 కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయి. తుంగభద్ర జలాలను కర్ణాటక ఇష్టారాజ్యంగా వినియోగించకుండా బచావత్ ట్రిబ్యునల్ అనేక నిబంధనలను కృష్ణా అవార్డులో పొందుపరచింది. అయినప్పటికీ ఆ నిబంధనలు ఖాతరు చేయకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా బ్రిడ్జి కం బ్యారేజీలను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడానికి పూనుకుందన్న ప్రచారం ఉంది.



టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఆర్డీఎస్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సరిగా అందని పరిస్థితి ఉంది. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా 1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరం ఉందని గ్రహించిన సిఎం వీటిపై ఆరా తీసారు. దీంతో మంత్రులు, అధికారులతో ఆయన సమీక్షించారు. ఇదిలావుంటే తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు మాజీమంత్రి హరీష్ రావు సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు.

## రాజకీయాల్లో మహిళా వివక్ష

రాజకీయాల్లో ఏది మాట్లాడినా తన మీద సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ చేస్తున్నారని టీఆర్ఎస్ చీఫ్ కవిత అన్నారు. ఆడవాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఇలానే టార్గెట్ చేస్తారనే భావనతోనే కొందరు కావాలనే ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష కొనసాగుతోంది. అనేక రంగాల్లో మగవారికే ప్రాధాన్యత లభిస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో కులాల కంటే.. మగవారి కులం, ఆడవారి కులం అనే రెండు మాత్రమే ఉన్నాయనిపిస్తోందని కవిత వ్యాఖ్యానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన వేట విమెన్ ఎంపవర్‌మెంట్ సమ్మిట్‌లో మాట్లాడిన కవిత.. సమాజంలో, రాజకీయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై ఆమె ఎమోషనల్ అయ్యారు. తెలంగాణ వచ్చాక పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తెచ్చుకున్నా.. ఇప్పటికీ



అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. జీన్-జెడ్ జనరేషన్‌లోనూ అమ్మాయిలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, మహిళలు ఎదగాలని చూస్తే వెంటనే తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఐటీ, బ్యాంకింగ్, మీడియా రంగాల్లో ఎంత సత్తా చాటుతున్నా.. పెళ్లి, కుటుంబ బాధ్యతల వల్ల మళ్లీ కెరీర్‌ను మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తోందని, అందుకే మహిళలకు ప్రభుత్వాలు, కుటుంబం, సమాజం సపోర్ట్ ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలపై కవిత షాకింగ్ గణాంకాలను బయటపెట్టారు. 2026 లో కూడా తెలంగాణ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని.. పె÷-లకైన 15-19 ఏళ్ల మధ్యలోనే అమ్మలవుతున్న టీనేజర్ మదర్స్ గ్రామీణ ప్రాంతాల్లో 7.2 శాతం ఉంటే, హైదరాబాద్ లాంటి మహానగరంలోనే 2.7 శాతం మంది ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులకు పిలుపునిస్తూ.. సోషల్ మీడియాలో లైకులు, ఫాలోవర్స్ రాలేదని నిరుత్సాహపడొద్దని, మహిళలంతా ఒక మంచి టా÷-గ్గ÷ట్ పెట్టుకొని, దాన్ని సాధించే దిశగా బలమైన గొంతుకతో ముందుకు సాగాలని కవిత పిలుపునిచ్చారు.

## సర్ ప్రక్రియలో పేరు తొలగింపు

మొదటిపేజీ తరువాయి..

పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది.

## లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌కు భూసేకరణ

మొదటిపేజీ తరువాయి..

పరిసర ప్రాంతాల్లో భూములను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి భూసేకరణ, సర్వే ప్రక్రియ, ముంపు ప్రాంతాల గుర్తింపు తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు సమీక్ష నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం దాదాపు 2,919 ఎకరాల భూమి అవసరమవుతుందని అధికారులు తేల్చారు. ఈ మేరకు భూసేకరణ పనులను వేగవంతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముమ్మరంగా కసరత్తు చేయనున్నారు. 2.80 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించనున్న లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక భాగంగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే దక్షిణ తెలంగాణలోని దాదాపు 4.97 లక్షల హెక్టార్ల భూములకు సాగునీరు అందనుంది. సాగునీటితో పాటు ఈ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభించనుంది.? రిజర్వాయర్ నిర్మాణంతో పరిగి, వికారాబాద్, తాండూరు రైతుల పొలాలు సస్యశ్యామలం అవుతాయని ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు

మొదటిపేజీ తరువాయి..

ఖమేనీ అంత్యక్రియలను ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. మొదట టెహ్రాన్, ఖోమ్ పట్టణాల్లో అంతిమ సంస్కారాలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించను న్నారు. అనంతరం ఖమేనీ స్వస్థలమైన మషాద్‌లో ఖననం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ దేశాల నాయకులను, ప్రతినిధి బృందాలను ఇరాన్ ఆహ్వానిస్తోంది. కాగా, ఇరాన్ నుంచి వచ్చిన ఆహ్వానంపై భారత ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ప్రధాని మోదీ స్వయంగా హాజరవుతారా లేదా భారత తరఫున ప్రత్యేక ప్రతినిధిని పంపుతారా అనే అంశంపై దౌత్య వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారత్-ఇరాన్ మధ్య ఇంధనం, వాణిజ్యం, ప్రాంతీయ భద్రత, చాబహార్ నౌకాశ్రయం వంటి కీలక అంశాల్లో సహకారం కొనసాగుతోంది.

## ముంబైలో భారీ వర్షాలు.. సమీక్షకు దిగిన మేయర్

నైరుతి రుతుపవనాలు ముంబై నగరాన్ని చేరుకున్నాయి. దీంతో నగరంలో మంగళవారం నుంచి భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం ఉదయం మేయర్ రీతూ తావ్డే వర్ష పరిస్థితులను సమీక్షించటం కోసం బయటకు వచ్చారు. దాదార్, హింద్‌మాతా, గాంధీ మార్కెట్ ఏరియాల్లో పర్యటించారు. ఈ నేపథ్యంలోనే ఊహించని సంఘటన చోటుచేసుకుంది. రీతూ తావ్డే ఫుట్‌పాత్‌పై ఉండి అధికారులతో మాట్లాడుతుండగా ఓ వ్యక్తి అటు వైపు నడుచుకుంటూ వచ్చాడు. రీతూ తావ్డే కళ్ల ముందే తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌లో పడిపోయాడు. డ్రైనేజీ నీటితో పూర్తిగా కప్పబడిపోయిన మ్యాన్‌హోల్‌ను అతడు గుర్తించలేకపోయాడు. అటువైపు నడుచుకుంటూ వచ్చి అందులో పడిపోయాడు. మేయర్ వెంట ఉన్న సిబ్బంది వెంటనే స్పందించారు. అతడిని బయటకు తీసుకువచ్చారు. మ్యాన్‌హోల్‌లో పడిపోయిన ఆ వ్యక్తిని బీఎంసీలో పని చేసే పారిశుద్ధ్య కార్మికుడిగా గుర్తించారు. ఈ ఘటన నేపథ్యంలో మేయర్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాన్‌హోల్స్ తెరిచి ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రీతూ తావ్డే మీడియాతో మాట్లాడుతూ.. 'మ్యాన్‌హోల్ శుభ్రం చేయటం కోసం దాని మూతను తెరిచి ఉంచారు. దాని చుట్టూ హెచ్చరిక బోర్డులను కూడా ఉంచారు. రోడ్డుపై అలాంటి హెచ్చరిక బోర్డులు ఉన్నపుడు జనం జాగ్రత్తగా ఉండాలి. బీఎంసీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను, గోడలపై అతికించిన పోస్టర్లను ప్రజలు ఒకటికి రెండు సార్లు చదవాలని కోరుతున్నాను' అని అన్నారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

### తుంగభద్ర జలాల్లో తెలంగాణకు
# అన్యాయం

మొదటిపేజీ తరువాయి..

కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనా లను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి , చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదని నిలదీసారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా 1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పుడు కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. చివరి దశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణ పేట, కొడంగల్ కు నీళ్ళు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా దాన్ని పక్కనబెట్టారు. కమీషన్ల కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీసారు. 16.94 టీఎంసీల కేటాయింపులో సుమారు 7 టీఎంసీలను కొడంగల్ లిఫ్టుకు మళ్లించి రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించే భీమా ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా బ్రిడ్జి కం బ్యారేజీలను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడానికి పూనుకుంటున్నది. ఇంత ద్రోహం జరుగుతుంటే మీరు, మీ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం తెలంగాణా ప్రయోజనాలకు ద్రోహం తలపెట్టడం కాదా అని లేఖలో పేర్కొన్నారు. తమ జల హక్కులను కాపాడుకోవడానికి మరోసారి ఉద్యమించాల్సిన పరిస్థితి తీసుకురావద్దని హెచ్చరిస్తున్నాం.స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రతి నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పాలమూరు రైతాంగం భవిష్యత్తు కోసం, తెలంగాణ జల హక్కులను కాపాడటం కోసం బీఆర్ఎస్ నిర్విరామ పోరాటం చేస్తుంది.

## మాడ్గుల మండలం స్కూళ్లలో ప్రీప్రైమరీ తరగతులు

మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల, పాములపాడు, చర్లగూడెం ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ప్రీ ప్రైమరీ తరగతులను ఎంఈఓ సీహెచ్ వెంకటమ్మ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను విజయవంతంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఈ ప్రీ-ప్రైమరీ తరగతులు అందుబాటులో ఉంటాయి. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎం భిక్షం, జీహెచ్ఎం పద్మావతి, ఆగా మోత్కూర్ కాంప్లెక్స్ హెచ్ఎం వై.వినోద్ కుమార్, చర్లగూడెం హెచ్ఎం నిరంజన్ రెడ్డి, పాములపాడు హెచ్ఎం వెంకన్న, ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు, ఏపీసీ చైర్మన్ నాగలింగమ్మ, చర్లగూడెం ఉప సర్పంచ్ జ్యోతి, కార్యదర్శి అశోక్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

# నల్లగొండకు సిటీ బస్సు సర్వీసులు



మొదటిపేజీ తరువాయి..

ఉంటుందని చెప్పారు. బుధవారం కోటి 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తొలుత 2 సిటీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిటీ బస్సు సర్వీసులు చెరువుగట్టు-ఎస్ఎల్‌బీసీ మార్గంతో పాటు ధర్వేశిపురం నుండి దుప్పలపల్లి వరకు నడిచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నల్లగొండకు అదనంగా 30 బస్సులు కేటాయించడం జరిగిందని, 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ పంపు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బస్టాండ్ విస్తరణలో భాగంగా కొత్త కౌంటర్లు, వెయిటింగ్ గా÷-డ్గ÷న్, బాత్రూంలు, టాయిలెట్లు, ఆధునిక ఎ÷-లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పనుల కోసం అదనంగా రూ.5 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ అభివృద్ధికి రూ.83 కోట్ల రూపాయలతో తాగునీటి శుద్ధి (వాటర్ ఫిల్టర్) వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది మోడల్ సిటీగా రూపొందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కురిసిషా ఖాన్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక ఆర్థిక శాఖ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, కార్పొరేటర్ కవిత, రమేశ్, లైజన్ ఆఫీసర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## నేటి నుంచే తెలంగాణలో 'సర్'

పత్రాలను ఇస్తారు. ఆ పత్రాలను ఎలా నింపాలో వివరిస్తారు. నింపిన రెండు పత్రాల్లో ఒకటి బీఎల్‌వో తీసుకుని, రెండో దాన్ని రసీదుగా ఇస్తారు. ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ష్ట్రజూం:జశీవతీం.వఎఱ.స్త్రశీజ.ఱఅ లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ పత్రాన్ని నింపొచ్చు. గురువారం నుంచి ఈ పత్రాలను ఎన్నికల సంఘం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనుంది. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న మొబైల్ నంబరు లేదా ఎపిక్ కార్డు నంబరును ఉపయోగించి ఓటరు... పోర్టల్‌లోకి లాగిన్ కావాలి. ఓటరు జాబితాలో, ఆధార్ కార్డులో పేరు సరిపోలిన ఓటర్లకు మాత్రమే ఈ సౌకర్యం ఉంటుంది. పత్రాలను పూరించడంలో ఏమైనా సందేహాలు ఉన్నా, బీఎల్‌వో ఇంటికి రాకపోయినా 1950 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు. ఎన్యూమరేషన్ పత్రం ఓటరుకు ఇచ్చిన సమయంలో బీఎల్‌వోల వద్ద మ్యాపింగ్‌కు సంబంధించి వివరాలు ఉంటాయి.

# గొడుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో, సామూహిక అక్షరాభ్యాసం

- ముఖ్య అతిథి, సర్పంచ్ మద్దెల వనజ,
- వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి,
- స్కూల్ హెడ్మాస్టర్ బాల్ రెడ్డి



**జూన్ 24 (సీ కే న్యూస్) చేగుంట :**అక్షర అభ్యాసం, దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో యూకేజీ నుండి 4వ తరగతి పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు, సర్పంచ్ మద్దెల వనజ, తను మాట్లాడుతూ మన పాఠశాలకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి సహకారం తో ప్రహరీ గోడ ప్రిప్రైమరి పాఠశాల మంజూరు కావడం జరిగిందని ఈ అవకాశ నీ విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు, అలాగే విద్యార్థుల పైన ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి వారు కోరారు తలిదండ్రులు పిల్లలపైనా శ్రద్ధ పెట్టాలని బడి నుంచి ఇంటి వద్దకు రాగానే స్కూల్లో చూపిన పాటల గురించి పిల్లలను అడిగి తెలుసుకోవాలి, ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి హెడ్మాస్టర్ బాల్ రెడ్డి టీచర్స్,పి బాల్ రెడ్డి, (హెచ్ఎం) ఎన్ శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ కుమార్, నవీన్ కుమార్, సునీత, మనోజ్ కుమార్, అంగన్వాడీ టీచర్ రేఖ, నాగరాణి, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు,

# వాజేడు కళాశాల పాతికేళ్ల ప్రస్థానంలో తల్లి కొడుకు అదే కళాశాలలోఅదే గ్రూపులో....!



**సికే న్యూస్ వాజేడు మండల ప్రతినిధి షేక్ రహీమ్ :**మారుమూల గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్ విద్యా సౌకర్యాలు అందించే లక్ష్యంతో.. గత పాతికేళ్ల క్రితం 2002 లో వాజేడు లో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థానిక నాయకుల ప్రజల ఆకాంక్ష మేరకు ఏర్పాటు చేయడం జరిగింది,

వాజేడు వెంకటాపురం మండలాలకు చెందిన నిరుపేద గిరిజన విద్యార్థులు అసంఖ్యాకంగా ఈ కళాశాలలో చేరి ఎన్నో ఉన్నత ఉద్యోగాలు పదవులు చేసిన సందర్భం ఉంది...

ప్రస్తుతం వాజేడు జూనియర్ కళాశాల రజతోత్సవ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా.. బుధవారం ఒక విశేషం జరిగింది,

2005 లో ఇదే కళాశాలలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన వాసం రామకుమారి హెచ్. ఇ. సి, గ్రూపులో చదివి మంచి మార్కులతో పాస్ అయింది, అదే స్ఫూర్తితో ఈరోజు తన కుమారుడు లొడిగె జస్వంత్ ను కూడా హెచ్ ఎస్ సి ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ చేయించింది, తనకు లాగే తన కుమారునికి కూడా.. మంచి విద్యాబుద్ధులు చెబుతారనె నమ్మకంతోనే ఈ కళాశాలలో చేర్పిస్తున్నట్లుగా తెలియజేసింది.

తల్లితండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం కృషి చేస్తున్నామని ఈ ప్రాంతపు విద్యార్థులంతా ఈ కళాశాలలోనే చదివి ఈ కళాశాల అభివృద్ధికి దోహదం చేయాలని ప్రిన్సిపాల్ కె. విజయ కుమార్ అన్నారు,

ఈ సందర్భంగా కళాశాల ఉపన్యాసక బృందం విద్యార్థితో పాటు తల్లిదండ్రులను అభినందించారు...

# పందిళ్ళపల్లి ఉన్నంత పాఠశాలలో పుస్తకాలు మరియు బ్యాగులు పంపిణీ.



**సీకే న్యూస్ ప్రతినిధి నరేందర్ :** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్ళపల్లి జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నంత పాఠశాలలో ఈరోజు ఆశా జ్యోతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ మరియు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వత్సవాయి పద్మ ముఖ్య అతిథి హాజరు అయి వారి చేతుల మీదగా అందించడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులుకు విద్య నేర్చుకో తలరాత మార్చుకో, పెద్దలు పనికి పిల్లలు బడికి, చదువుకి దగ్గరగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి అని కొన్ని సందేశాలు విద్యార్థులకు వివరంగా తెలిపారు .ఈ కార్యక్రమం నిర్వహించిన ఆశాజ్యోతి ఫౌండేషన్ వారిని అభినందించారు.ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ మేకల కల్పన , ఎంఈఓ శ్రీనివాస్ ,హెడ్ మాస్టర్ శ్రీనివాస్ ,ఫౌండేషన్ సి ఎఫ్ ఓ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాహాయం

కాంగ్రెస్ నాయకుడు బాలపోచయ్య



**జూన్ 24 సీ కే న్యూస్ చేగుంట :** ఇటీవల అనారోగ్యంతో మరణించిన వ్యక్తి, మాసాయిపేట మండలం పుల్లిగుట్ట తండా కు చెందిన మాలోత్ కాశిరామ్ మరణించిన విషయం తెలుసుకొని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆదేశాల మేరకు,బుధవారం మాసాయిపేట సర్పంచ్ కిష్టారెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మాలోత్ శాంతి, వారి కుటుంబాన్ని పరామర్శించి,పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చి, వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేశారు, ఈ కార్యక్రమం లో మండల మహిళా అధ్యక్షురాలు మాలోత్ శాంతి, వార్డ్ సభ్యులు డాక్టర్ రవి, గొల్ల పోచయ్య, పొన్నాల ఎల్లం,పొన్నాల రవి, మాజీ ఎంపీటీసీ అంజగౌడ్,కాంగ్రెస్ నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి ఆర్థిక చేయూత



- మానవత్వం చాటుకున్న మాజీ మంత్రివర్యులు
- గత రెండు సంవత్సరాలుగా బిఎస్సి నర్సింగ్ కి అయ్యే ఖర్చులను భరిస్తున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి....

**పెబ్బేరు మున్సిపాలిటీ జూన్/24 ( సి కే న్యూస్ )** పెబ్బేరు మండలం సూగురు గ్రామానికి చెందిన రాజు సునీతల కుమార్తె ఒక పేద కుటుంబంలో జన్మించిన విద్యార్థికి చదువుపై ఎంతో ఆసక్తి ఉన్నప్పటికీ, పాఠశాల ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, ప్రయాణ ఖర్చులు వంటి అవసరాలను తీర్చడం కష్టమవుతుందని, ఆర్థిక సమస్యల కారణంగా మానస చదువును వదిలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి.మాజీ సర్పంచ్ జూదం వెంకటేష్ విషయం చేరవేర్చారు. ఆ కుటుంబం యొక్క యోగ క్షేమాలు తెలుసుకున్నాడు. వారికీ ముగ్గురు సంతానం అని రాజు కూడా ఆరోగ్యం బాగు లేక చనిపోవడం కుటుంబ పెద్ద దిక్కు లేకపోవడం తో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గత సంవత్సరం సూగురు వెళ్ళినప్పుడు రాజు ఇంటి దగ్గరకు వెళ్ళి మానస చదువులకు అయ్యే పూర్తి బాధ్యత తనదే అని మాట ఇవ్వడం జరిగింది. గత సంవత్సరం ఆమె చదువులకు అయ్యే ఖర్చులు ఇచ్చి ఈ సంవత్సరం కూడా అకాడమిక్ ఇయర్ స్టార్ట్ అవ్వడం తో ఆమె చదువులకు కావాల్సిన డబ్బులను సమాకూర్చి ఆమెకు ఇవ్వడం జరిగింది. ఏదో మాట వరుసకు చెప్పాము మనకెందుకు లే అనుకునే ఈ రోజుల్లో గుర్తుంచుకొని మరి ఆ పేదింటి బిడ్డకు మద్దతుగా నిలిచిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పలువురు ధన్యవాదములు తెలియజేసారు.

నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వారికీ ఆర్థిక సహాయం అందిస్తే ఉన్నత శిఖరాలను చేరుకోగలరని,ఈ సహాయం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. తమ కలలను సాకారం చేసుకునేందుకు వారు మరింత కృషి చేస్తారని

చరిత్రలో ఎంతోమంది మహనీయులు పేదరికాన్ని అధిగమించి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. వారికి సరైన సమయంలో అందిన సహాయం వారి జీవితాలను మార్చింది. నేటి పేద విద్యార్థులకు అందించే ఆర్థిక చేయూత కూడా రేపటి శాస్త్రవేత్తలు, వైద్యులు, ఉపాధ్యాయులు, నాయకులను తయారు చేయగలదని

అందువల్ల సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పేద విద్యార్థులకు సహాయం చేయాలి. ఒక విద్యార్థికి అందించిన చిన్న సహాయం అతని జీవితాన్ని వెలిగించడమే కాకుండా, సమాజ అభివృద్ధికి కూడా దోహదపడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు బాగుంటే దేశ భవిష్యత్తు కూడా ప్రకాశవంతంగా ఉంటుంది. కాబట్టి పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించడం ఒక గొప్ప మానవతా సేవ అని చెప్పవచ్చు అని అన్నారు.

కార్యక్రమం లో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మండల అధ్యక్షులు వనం రాములు మాజీ మున్సిపల్ చైర్మన్ కర్రెస్వామి, పట్టణ అధ్యక్షులు దిలీప్ రెడ్డి ముఖ్య నాయకులు, రాజశేఖర్ వెంకటేష్ గోవిందు, నాయుడు వడ్డె రమేష్ మధు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ పై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి పై నిరసనగా ర్యాలీ...

- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం...
- కేంద్ర విద్యా శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి....
- పీసీసీ ఆదేశాల మేరకు డిసిసి జిల్లా ఆధ్వర్యంలో విద్యార్థులతో నిరసన ర్యాలీ .....



**సీకే న్యూస్ ప్రతినిధి గద్వాల** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని విద్యా వ్యవస్థ పై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి పై నిరసన ర్యాలీ పిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గారి ఆదేశాల మేరకు జిల్లా డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ పాత బస్టాండ్ నుండి కృష్ణవేణి చౌక్ వరకు పెద్ద ఎత్తున విద్యార్థులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది.

**జిల్లా డిసిసి అధ్యక్షుడు గారు మాట్లాడుతూ...**

కేంద్ర ప్రభుత్వం అసమార్థ పాలన వలన విద్యా వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరికి పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గారి సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.

విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమారుతో నీటు పరీక్ష పేపర్ లీకులు చేయడంతో ఎంతోమంది జీవితాల నాశనం కావడం జరుగుతుంది. కాబట్టి ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలి కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు.

లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గారు రాజస్థాన్ రాష్ట్రంలో ప్రారంభించిన ' ఛాత్రోంకి గుంజ్ ' ( విద్యార్థి యువత గొంతుక ) మహా ఉద్యమానికి గద్వాల్ డిసిసి మద్దతు నిస్తుందన్నారు నీట్ పరీక్షల రద్దు, ప్రశ్నపత్రాల లీకేజీలు,ఉద్యోగ నియామకాలలో జాపం పెరుగుతున్న నిరుద్యోగం యువతను ఆందోళన గురి చేస్తుందని పేర్కొన్నారు...

విద్యాశాఖ మంత్రి ఏ ముఖం పెట్టుకొని ఇంకా పదవిలో కొనసాగుతున్నారు అర్థం కావడం లేదు విద్యార్థుల శాపం కచ్చితంగా తగలకనే తగులుతుంది వారికి...

దేశవ్యాప్తంగా 23 లక్షల మంది నీట్ ఎగ్జాం రాస్తే ఈ డబల్ ఇంజన్ సర్కార్ వారిపై పెట్రోల్ పోసి తగల పెట్టినంత పని చేసింది...

వారు అధికారంలో ఉన్న ప్రధాన రాష్ట్రాలు అయినటువంటి మహారాష్ట్ర మరియు రాజస్థాన్ రాష్ట్రాలలో ఎగ్జామ్ 42 గంటల ముందే నీట్ ఎగ్జాం పేపర్ లీక్ చేసిన చరిత్ర ఈ డబల్ ఇంజన్ సర్కార్ ది....

నిరుద్యోగుల భవిష్యత్తును అంధకారంలో నెట్టడంలో బీజేపీ ని మించిన పార్టీ ఇంకొకటి లేదు...

విద్యార్థుల జీవితాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు...

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, వ్యవసాయ మార్కెట్ హనుమంతు, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా సీనియర్ నాయకులు, కౌన్సిలర్స్, మాజీ కౌన్సిలర్స్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం



**జూన్ 24 (సీ కే న్యూస్) చేగుంట** :చేగుంట మండల్ ఇబ్రహీంపూర్ గ్రామంలో ప్రాథమిక పాటశాలలో మొదటి తరగతి విద్యార్థి విద్యార్థినులకు సామూహిక అక్షరాభ్యాస నిర్వహించడం అంగన్వాడి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది ఇట్టి ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మరియు గ్రామ సర్పంచ్ జ్యోతి రామ్ రెడ్డి ఉప సర్పంచ్ చౌదరి శ్రీనివాస్.గ్రామ కార్యదర్శి. మాధవి. వార్డు సభ్యులు నరసింహులు నవీన్ రాజు నవీన్ శ్యామల మణెమ్మ మరియు ఉపాధ్యాయులు.మురళి.షాహెద్. అంగన్వాడీ టీచర్లు బుజ్జమ్మ బాల లక్ష్మి మరియు విద్యార్థి విద్యార్థినులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# బి ఆర్ ఎస్ మాజీ కౌన్సిలర్ కోటేష్ గారిని పరామర్శించిన...

- తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమైక్య (౦+టా+ణజఖీూ) చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య గారు...



**సీకే న్యూస్ ప్రతినిధి గద్వాల**

కర్నూల్‌లోని Kamineni Hospitals లో కాలు శస్త్రచికిత్స అనంతరం చికిత్స పొందుతున్న బి ఆర్ ఎస్ మాజీ కౌన్సిలర్ కోటేష్ గారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమైక్య (౦+టా+ణజఖీూ) చైర్‌పర్సన్ శ్రీమతి సరిత తిరుపతయ్య గారు ఆసుపత్రికి చేరుకొని ఆయనను పరామర్శించారు.

ఈ సందర్భంగా సంబంధిత వైద్య అధికారులతో మాట్లాడి కోటేష్ గారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ప్రజల పట్ల తన అనుబంధాన్ని, నాయకత్వ బాధ్యతను మరోసారి చాటిచెప్పారని స్థానిక నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎల్లప్ప, పెద్దపల్లి సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి, ఆనంద్ గౌడ్, బోరుబండి వీరన్నతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రాజ్యాధికార సమరభేరి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ.


ఆవిష్కరించిన మండల అధ్యక్షులు బొలుగుల నరసింహ ఏకలవ్య.

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 24.**తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న నాయకత్వంలో జూలై 5న భువనగిరిలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి మహాసభను విజయవంతం చేయాలని వలిగొండ మండల రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షులు బొలుగుల నరసింహ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా వద్ద రాజ్యాధికార సమరభేరి మహాసభ పోస్టర్ ను బుధవారం ఆవిష్కరించారు అనంతరం నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం హక్కులు సామాజిక న్యాయం.రాష్ట్రభివృద్ధి లక్ష్యాలతో నిర్వహిస్తున్న ఈ మహాసభకు ప్రజలు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు తెలంగాణ రాజకీయాల్లో బహుజన వర్గాల స్వరాన్ని మరింత బలంగా వినిపించే వేదికగా ఈ సమరభేరి నిలుస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రాజ్యాధికార పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ళ రమేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొలుసుల శ్రీనివాస్ కమిటీ సభ్యులు కొండ నరేష్ లాక్య నరసింహ మానుపాడి లక్ష్మయ్య భూపతి అశోక్ గుగ్గిళ్ళ శేఖర్ రవికుమార్ ఎండి ఆస్కార్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.

- మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి. ఆ
- డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.
- సంచార కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గారు, జిల్లా కలెక్టర్ గారు ,




సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల్ :ఈరోజు గద్వాల నియోజకవర్గంలోని గట్టు మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనం నందు సెర్ప్ ఆధ్వర్యంలో, మోవో స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో మహిళా సంచార కేంద్రం ప్రారంభోత్స కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గారు హాజరయ్యారు..

ఎలక్ట్రికల్ స్కూటీలు, ఆటో, సైకిల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గారు జిల్లా కలెక్టర్ గారు

ఎలక్ట్రికల్ ఆటోలో ఎమ్మెల్యే గారు జిల్లా కలెక్టర్ గారు ఎక్కి ప్రయాణించారు...

**గద్వాల ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ....**

గతంలో గట్టు మండలంలో వలసలు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఎక్కువగా ఉండేవని, ప్రజలు పేదరికంతో ఇబ్బంది పడే వారని, ప్రస్తుతం ఈ ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు.

గతంలో అక్షరాస్యతలో గట్టు మండలం ఆసియా ఖండంలోనే వెనుకబడి ఉండేది కానీ ఇప్పుడు గత పది సంవత్సరం గట్టు మండలంలో కూడా అక్షరాస్లలో ముందంజలో ఉంది 40% వరకు అక్షరాభ్యాసం పెరగడం జరిగింది. ఈ ప్రాంతంలో లోని విద్యార్థులు ప్రభుత్వ రంగాలలో సంస్థలు పోలీస్ టీచర్స్ ఉద్యోగాలు సాధించడం జరిగింది గత సంవత్సరం 8 మంది విద్యార్థులు మెడికల్ లో ఎంబిబిఎస్ సీట్లు సాధించడం జరిగింది. ఈ సంవత్సరం కూడా పదిమంది విద్యార్థులు ఎంబిబిఎస్ లో సీట్లు సాధించడం జరిగిందని తెలిపారు.

మహిళల సాధికారత, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గట్టు ప్రాంత మహిళల సంక్షేమం, రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం మహిళా మొబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మహిళా సంఘాలను ఆర్థికంగా బలపతం చేయాలని తెలంగాణ రాష్ట్రం సీఎం గారు మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగింది అదేవిధంగా మహిళలకు వడ్డీ లేని రుణాలను కూడా జరిగింది మహిళలకు కోసం బస్సును, మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసి దాని నుండి వచ్చిన లాభం మండల మహిళా సమాఖ్య జమ చేసి మహిళా సంఘాలకు ఆర్థికంగా అభివృద్ధి కొరకు ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని, గట్టు మండలంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సభ్యులను చేసుకోవాలని కోరారు.

**జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ ...**

రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా గట్టు మండలంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నాలుగు ఎలక్ట్రికల్ స్కూటీలు, ఒక ఆటో, సైకిల్ ను కొనుగోలు చేసి డ్రైవింగ్ లో కిశోర బాలికలు,మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. మహిళలు డ్రైవింగ్ నేర్చుకునేందుకు వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహించి, సహకరించాలని కోరారు.

మహిళా సమాఖ్య తరపున ఈ వాహనాలను అద్దెకు ఇచ్చి కూడా సభ్యులు ఆదాయం పొందవచ్చన్నారు.మహిళా సంఘాలు ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు,తదితర కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వం తెలంగాణ ఇంక్లూజివ్ లైవ్లీహుడ్ ప్రోగ్రాంకు జిల్లాలో అత్యంత వెనుకబడ్డ గట్టు మండలంను ఎంపిక చేసినందున ఇక్కడి 14 గ్రామాల్లో 1033 కుటుంబాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఈ కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే కాక ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలను కూడా ఇప్పించడం జరుగుతుందన్నారు.

మోవో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు .

**స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించిన కలెక్టర్**

అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలో అసంపూర్తిగా నిర్మించబడ్డ స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించారు. అలాగే పలువురు విద్యార్థులు చుట్టుపక్కల వివిధ ప్రభుత్వ విద్యాలయాల్లోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గట్టులోని జడ్పీహెచ్ఎస్ ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వివిధ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మోవో స్వచ్ఛంద సేవా సంస్థ సీఈఓ జయ భారతి, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, నాయకులు గద్వాల తిమ్మప్ప, ఆలీ, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మమ్మ ఉ సవారమ్మ అవ్వ దేవర మహోత్సవానికి హాజరైన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

- బాసు హనుమంతు నాయుడు గారు



సి.కె న్యూస్ ప్రతినిధి గద్వాల్ :ఈరోజు గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం ఎములోని పల్లి గ్రామంలో గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ లక్ష్మమ్మ ఉ సవారమ్మ అవ్వ దేవర మహోత్సవం సందర్భంగా అమ్మవారిలని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి,అమ్మవారి ఆశీస్సులను పొందారు...

అనంతరం,బాసు హనుమంతు నాయుడు గారిని గ్రామ నాయకులు శాలువతో ఘనంగా సత్కరించారు...

బాసు హనుమంతు నాయుడు గారిని డోల మేళాలతో పార్టీ నాయకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు...

అదే విధంగా,ధరూర్ మండలం ఓబులోని పల్లి గ్రామంలో జరిగిన మాజీ సర్పంచ్ నాగన్న గారి గృహప్రవేశానికి హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు....

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

గ్రామా ప్రజలందరికీ శ్రీ లక్ష్మమ్మ ఉ సవారమ్మ అవ్వ దేవర మహోత్సవం శుభాకాంక్షలు తెలిపారు....

గ్రామంలోని గ్రామ దేవతలను పూజించడం వల్ల గ్రామానికి ఎలాంటి చెడుగాలి సుఖకుండా గ్రామం పై ఎలాంటి నరదృష్టి రాకుండా గ్రామదేవతలు కాపాడడం జరుగుతుంది అని అన్నారు.గ్రామంలో దేవర సందర్భంగా ప్రతి ఇంట్లో పండగ వాతావరణం నెలకొందని అని అన్నారు.గ్రామదేవత శ్రీ లక్ష్మమ్మ ఉ సవారమ్మ అవ్వ ఆశీస్సులతో గ్రామంలోని ప్రజలు మరియు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు....

ఈ కార్యక్రమంలో రాజారెడ్డి,అల్లాపాడు ప్రతాప్,వెంకటేష్ నాయుడు, సోమశేఖర్ రెడ్డి,మోనేష్, జాంపల్లి భరత్ సింహారెడ్డి,రాముడు,రమేష్,శివ,కృష్ణ,ఆంజనేయులు, మాల శ్రీను,చంద్ర శేఖర్, మణి వర్ధన్,లక్ష్మయ్య, రవి,శాంతన్న, పరశురాముడు,ఆంజనేయులు, కృష్ణారెడ్డి,తిమ్మప్ప, రంగారెడ్డి, స్వామి,సవారీ,గరుశాల,డ్యామ్ శ్రీను, మహేందర్, నరేష్,చిన్న వీరేష్,హరికృష్ణ,జమన్న, ప్రహ్లాదు,రమేష్,నరసింహులు,గోవిందు, అంజి,వెంకటేష్,రాము,రాజు,రాముడు, మల్లికార్జున్, ప్రవీణ్ మరియు గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు....

## డ్రగ్స్ డీ-అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించి, నోటు పుస్తకాలు, ఆట వస్తువులు పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు




సీ కే న్యూస్ ప్రతినిధి గద్వాల :గద్వాల జిల్లా కేంద్రంలోని పాత ఎస్పీ కార్యాలయం సమీపంలో ఉన్న 'మన' డ్రగ్స్ డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) కేంద్రాన్ని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు గారు సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో చికిత్స పొందుతున్న వారి కోసం నిర్వాహకులకు నోటు పుస్తకాలను, ఆట వస్తువులను ఆయన అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ.. మద్యపానం, డ్రగ్స్, ఆల్కహాల్, తంబాకు వంటి రకరకాల మత్తు పదార్థాలకు బానిసలైన వారిని ఆ వ్యసనాల నుంచి దూరం చేసి, వారికి పునరావాసం కల్పించడమే ఈ కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మత్తు పదార్థాలు ఉపయోగించే వారిపై ప్రతిరోజూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, వారికి కౌన్సిలింగ్, ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యసనపరులు తమ అలవాట్లను మానుకుని సాధారణ జీవితం గడిపేలా ఇక్కడ అన్ని వసతులతో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు గద్వాల సర్కిల్ ఇన్స్పెక్టర్ (జ×) టంగుటూరి శ్రీను, గద్వాల్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ (ా×) కళ్యాణ్ కుమార్ మరియు కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి.

– జిల్లా కలెక్టర్ అంకిత్.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 24 , ,జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

కార్యక్రమంలో ముందుగా మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికి వెళ్లినప్పుడు అనుసరించాల్సిన విధానాలు, ఫారాల సమర్పణ ప్రక్రియ, ఆన్లైన్ మరియు ఆఫ్లైన్ విధానాలు, ఆన్లైన్లో ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ దశలు, సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ఆఫ్లైన్ ఫారాల పూర్తి విధానం తదితర అంశాలను వివరించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకరించాలని కోరారు. ఇప్పటికే బీఎల్వోలు, బీఎల్ఏలు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులు క్షేత్రస్థాయి సన్నాహక శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిపారు.

జూన్ 25 నుండి జూలై 24 వరకు బీఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ధృవీకరించి నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 24 నుండి 30 వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతామని తెలిపారు.

జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించబడుతుందని, అనంతరం అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తప్పు సమాచారం సమర్పించిన సందర్భాల్లో వెంటనే తొలగింపు చేయకుండా, ముసాయిదా జాబితా అనంతరం నోటీసులు జారీ చేసి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత జాబితాలో పేరు లేని అర్హులైన కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫారం--6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన వారు ఫారం--8 ద్వారా వివరాల సవరణ చేసుకోవచ్చని అన్నారు .

ప్రతిరోజు బీఎల్వోలు గరిష్ఠంగా 50 ఫారాల వరకు సమర్పించే అవకాశం ఉందని తెలిపారు. బీఎల్వోలు, బీఎల్ఏలు సమన్వయంతో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని చెప్పారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసే యువత కూడా కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి ఓటర్ల జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు.

అనంతరం రాజకీయ నాయకులు పార్టీ ప్రతినిధులకు తలెత్తిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ సూపరిండెంట్ రంగ ప్రసాద్, టిఆర్ఎస్ పార్టీ వెంకటేశ్వర నాయక్, అన్వర్, కాంగ్రెస్ పార్టీ నుండి లక్ష్మణ్ అగర్వాల్, సిపిఐ పార్టీ నుండి అన్నవరపు సత్యనారాయణ, బిజెపి పార్టీ నుండి రవి నాయక్ తదితరులు, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు ప్రైజ్ అందజేసిన....

| మాజీ జెడ్పిటిసి సభ్యురాలు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పద్మ వెంకటేశ్వర రెడ్డి..




సికె న్యూస్ ప్రతినిధి గద్వాల్ :

ధరూర్ మండలం గార్లపాడు గ్రామం సర్పంచ్ పరిమళ శివరాజ్ మరియు గ్రామస్థుల అధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ నెలపూజ మరియు పోలమ్మ అవ్వ దేవర్ల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ కు ముఖ్య అతిధిగా మాజీ జెడ్పిటిసి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు పద్మ వేంకటేశ్వర రెడ్డి హాజరైనారు... శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ మరియు పోలమ్మ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు..అనంతరం రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్లో మొదటి విజేతకు పద్మ వెంకటేశ్వర రెడ్డి 30000/- రెండవ విజేతకు పరిమళ శివరాజు 20,000/- బహుమతులు అందజేసినారు...వారితో పాటు.. గార్లపాడు సర్పంచ్ పరిమల శివరాజ్ మరియు గ్రామస్థులు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

# పాగుంట మండల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన బిజెపి జిల్లా యువ నాయకురాలు డికె.స్నిగ్ధ రెడ్డి



సీకే న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు కెటి దొడ్డి మండల కేంద్రంలో పాగుంట గ్రామం లో క్రికెట్ టోర్నమెంట్ కు ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్ ను ప్రారంభించిన డికె.స్నిగ్ధ రెడ్డి గారు.

ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి డికె. స్నిగ్ధ రెడ్డి గారు మాట్లాడుతూ.....

క్రీడాకారులు గెలుపు ఓటమిలో సమానంగా స్వీకరించాలి .. దేశ ప్రతిష్టను పెంచుతూ క్రీడాకారులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి ఖేలో ఇండియా కార్యక్రమం తీసుకొని నూతన ఉత్తేజాన్ని యువతలో నింపుతున్నారు. ఓడిపోయిన వారు కృంగిపోకుండా గెలుపు దిశగా పయనించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ఉత్తేజపరుస్తూ ప్రోత్సహిస్తున్నారు

విద్యతో పాటు క్రీడ నైపుణ్యత పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలి అని కోరారు.క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే,ఓడిపోయినా నిరుత్సాహ పడకుండా స్నేహపూర్వకంగా క్రీడలను ఆడి, ఓడిపోయినా ఓటమి విజయానికి నాందిగా భావించాలని పేర్కొన్నారు....

గ్రామీణ ప్రాంతాల క్రీడా నైపుణ్యంతో జిల్లా, జాతీయస్థాయిలో క్రీడల్లో రాణించి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని అన్నారు ..

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ,మండల అధ్యక్షుడు శ్రీ పాద రెడ్డి, పాగుశీట సర్పంచ్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ నర్సిరెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు ఎర్ర భీమ్ రెడ్డి,బబుల్ రెడ్డి ,హన్మి రెడ్డి, దేవేందర్,సూర్య కాంత్ రెడ్డి, కృష్ణ కాంత్, నబీ సాబ్, పవన్, కొండన్న,గోవిందు,బెల్లం నరసింహులు రామకృష్ణ, సతీష్, తిరుమల్ ,వంశీ తదితరులు ఉన్నారు..

# ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రణా ళికతో నిర్వహించాలి...




**సి.కే న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి బోయ కిష్టన్న.**ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలి.

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్. ఓటరు జాబితాను తప్పులు లేకుండా సమగ్రంగా రూపొం దించేందుకు చేపట్టిన ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా ఈనెల 25 నుంచి ఇంటింటి సర్వేప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అన్ని మండలాల తహసి ల్దార్లు, బిఎల్ఓ లు, ఇతర అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల వారీగా సంబంధిత బిఎల్వోలు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన అంశాలన్నింటిని ఓటర్లు ఫారాలలో పూరించేలా అవగాహన కలిగించాలన్నారు. ఈ విషయంలో బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారం కూడా తీసుకోవ చ్చన్నారు. బిఎల్ఓ లు ప్రతిరోజు ఎన్ని ఇండ్లు తిరుగుతున్నారు, ఓటర్ల నుంచి ఫిలప్ చేయబడ్డ ఫారాలు ఎన్ని తిరిగి వచ్చాయనే సమగ్ర డేటాను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్ లో నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ అధికారులు ప్రతిరోజు రివ్యూ నిర్వహిం చనున్నట్లు చెప్పారు.బి ఎల్ఓ లకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత తహసిల్దారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. ఎవరైనా ఓటర్లు నిర్దేశిత వెబ్సైట్లో స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవడానికి కూడా అవకాశం ఉందన్నారు.2002 ఓటర్ లిస్టును ప్రామాణికంగా తీసుకొని ప్రస్తుతం ఎలాంటి తప్పులు లేని సమగ్ర ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ పై మాస్టర్ ట్రైనర్ తిమ్మారెడ్డి క్షుణ్ణంగా వివరించారు.ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, సూపర్వైజర్లు, బిఎల్ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుడు నట్టేసైదయ్యకు పరామర్శ

- నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి



**గరిడేపల్లి సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండల పరిధిలో ఉన్న కలమలచెరువు ఉమ్మడి గ్రామపంచాయతీ గంగానగరం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నట్టే సైదయ్యకు హుజూర్నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి వారి స్వగృహానికి వెళ్లి ఈరోజు పరామర్శించారు ఇటీవల కాలంలో బిఆర్ఎస్ పార్టీ మీటింగ్ ముగించుకొని ఇంటికి వస్తున్న నట్టే సైదయ్యకు రాయినిగూడెం సమీపంలో ఉన్న భానుచందర్ అనే రైస్ మిల్లు రేకులు కాళ్ళ మీద పడి రెండు కాళ్లు విరగడం జరిగింది సూర్యాపేటలో జిల్లా కేంద్రంలో ఉన్న అమ్మ హాస్పిటల్ లో నట్టే సైదయ్యకు రెండు కాళ్లకు సర్జరీ చేయడం వల్ల హాస్పటల్ నుంచి డిశ్చార్జి అయ్యి ఇంటికి వచ్చిన నట్టే సైదయ్యను హుజూర్నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి సారథ్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటికి చేరి పరామర్శించడం జరిగింది . సైదయ్యను వారి కుటుంబ సభ్యులను మనోధైర్యం కల్పించి నట్టే సైదయ్యను అన్ని విధాలుగా బిఆర్ఎస్ పార్టీ కాపాడుకుంటుందని బి ఆర్ ఎస్ పార్టీ పక్షాన సహాయ సహకారాలు ఉంటదని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు మున్సిపల్ కౌన్సిలర్ దొండపాటి అప్పిరెడ్డి సీనియర్ నాయకులు కేఎల్ఎన్ రెడ్డి మాజీ జెడ్పిటిసి అన్నపురెడ్డి నారాయణరెడ్డి మాజీ ఎంపీపీ చనబోయిన సైదులు పిచ్చిరెడ్డి గుర్రం మార్కండేయ భరత్ సుందర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## 20:20 ఎరువుల ధర పెంపుతో రైతన్న కంట కన్నీరు -- DAP సరఫరా లేదు,

**జూన్ 24 (సీ కే న్యూస్) చేగుంట**



ఖరీఫ్ సీజన్ దగ్గరపడుతుండగా ఎరువుల కొరత, ధరల పెంపు రైతులను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా 20:20:0:13 ఎరువు ధర పెరగడం, ఖాూ్రా పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో వరి, మొక్కజొన్న సాగు చేసే రైతులు ఇబ్బంది పడుతున్నారు.

**20:20:13 ఎరువు ధర -- రైతు గుండెల్లో రాయి**

ప్రభుత్వ సబ్సిడీతో వచ్చే 20:20:0:13 సల్ఫర్ మిశ్రమ ఎరువు గత ఏడాది 50 కిలోల బస్తా 1350 రూ. ఉంటే, ఈ ఏడాది 2150 కి చేరింది. అంటే ఒక్క బస్తాపై రూ.800 భారం పెరిగింది.

ఎకరానికి 2 బస్తాలు వేసుకుంటే ఒక్క ఎకరానికే 1600 రూ. అదనం. 5 ఎకరాల రైతుకు 4000 రూ. అదనపు ఖర్చు. అలానే డీజిల్, కూలీ రేట్లు పెరిగిన తరుణంలో ఇది రైతుకు పెద్ద భారమే.

"ఎరువు లేకుండా పంట రాదు, కొంటే అప్పులపాలు అవుతాం. ధరలు ఇలా పెరిగితే మేం బతికేది ఎలా?"

డిఎపి-- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరఫరా లేదు,

డై అమ్మోనియం ఫాస్ఫేట్ ఖాూ్రా 50 కిలోల బస్తా ప్రభుత్వ రేటు 1,350 రూ. కానీ గత 2 నెలలుగా మార్కెట్లో, సొసైటీల్లో ఖాూ్రా స్టాక్ కనిపించడం లేదు.

**కారణాలు:**

- అంతర్జాతీయంగా ఫాస్ఫేట్ రాక్ ధర పెరగడం
- దిగుమతులు ఆలస్యం అవడం
- ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు అలాట్‌మెంట్ తగ్గడం

**దీంతో రైతులు బ్లాక్ మార్కెట్లో 1,800-2,000 రూ. పెట్టి కొంటున్నారు. కొన్ని చోట్ల,**

రైతు ఆందోళనలు జరగకముందే ముందు జాగ్రత్తగా

డిఎపిపీ ఇవ్వకుండా 20:20 ధర పెంచితే పంట ఎలా పండిస్తాం? ప్రభుత్వం వెంటనే సబ్సిడీ పెంచి, సకాలంలో ఎరువులు ఇవ్వాలి,

సకాలంలో రైతులకు డిఎపి, యూరియా, అందించాలి రైతన్న, కోరారు,ద

## గొడుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో, సామూహిక అక్షరాభ్యాసం

- ముఖ్య అతిథి, సర్పంచ్ మద్దెల వనజ,
- వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి,
- స్కూల్ హెడ్మాస్టర్ బాల్ రెడ్డి



**జూన్ 24 (సీ కే న్యూస్) చేగుంట** అక్షర అభ్యాసం, దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో యూకేజీ నుండి 4వ తరగతి పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు, సర్పంచ్ మద్దెల వనజ, తను మాట్లాడుతూ మన పాఠశాలకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి సహకారం తో ప్రహరీ గోడ ప్రిప్రైమరి పాఠశాల మంజూరు కావడం జరిగిందని ఈ అవకాశ నీ విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు, అలాగే విద్యార్థుల పైన ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి వారు కోరారు తలిదండ్రులు పిల్లలపైనా శ్రద్ధ పెట్టాలని బడి నుంచి ఇంటి వద్దకు రాగానే స్కూల్లో చూపిన పాటల గురించి పిల్లలను అడిగి తెలుసుకోవాలి, ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి హెడ్మాస్టర్ బాల్ రెడ్డి టీచర్స్,పి బాల్ రెడ్డి, (హెచ్ఎం) ఎన్ శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ కుమార్, నవీన్ కుమార్, సునీత, మనోజ్ కుమార్, అంగన్వాడీ టీచర్ రేఖ, నాగరాణి, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు,

## ఆత్మకూరు ఎం పోలీస్ స్టేషన్ పరిధిలోని జెడ్ పి హెచ్ ఎస్ కూరెళ్ళలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం

**ఎస్ ఐ ,లక్ష్మీనారాయణ వారి ఆధ్వర్యంలో**







**సి కె న్యూస్ ఆత్మకూరు యం రిపోర్టర్ షేక్ అజీజ్ :** ఆత్మకూరు (ఎం) పోలీస్ స్టేషన్ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ కురెల్లలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ గారు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై, కుటుంబాలపై, సమాజంపై మరియు యువత భవిష్యత్తుపై కలిగే దుష్ప్రభావాలను వివరించారు.

గ్రామస్థులు తల్లిదండ్రులు, పిల్లలు మరియు సమాజంలో మాదక ద్రవ్యాల ప్రమాదాలపై అవగాహన కల్పించి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండే జీవన విధానాన్ని ప్రోత్సహించాలని కోరారు. చిన్నప్పటి నుంచే పిల్లల్లో మంచి విలువలు, సత్ప్రవర్తన అలవాటు చేయాలని, అలాగే మాదక ద్రవ్యాల వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన ఏ సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిర్మూలనకు చేపడుతున్న చర్యలకు మద్దతు తెలుపుతూ, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ అందరితో "డ్రగ్ ఫ్రీ సొసైటీ ప్రతిజ్ఞ" చేయించబడింది.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ. వెంకట్ రెడ్డి , ఉపాధ్యాయులు శ్రీనివాస్ , మరియు సిబ్బంది, స్థానిక ఉప సర్పంచ్ హనుమంతుల రమేష్ , మాజీ ఎంపీటీసీ పాపయ్య , స్థానిక నాయకులు సత్యనారాయణ , రమేష్ , మత్సగిరి , మరియు కానిస్టేబుళ్లు విద్యాసాగర్ , లక్ష్మణ్ , రామకృష్ణ , విజయ్ పాల్గొన్నారు.

## పేరూరులో ప్రత్యేక డ్రైవింగ్ లైసెన్స్ మేళా ఏర్పాటు చేయాలి: ప్రజా పోరాట సమితి



**సికే న్యూస్ వాజేడు మండల ప్రతినిధి షేక్ రహీమ్ :** పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజల సౌకర్యార్థం స్థానికంగానే ఒక ప్రత్యేక డ్రైవింగ్ లైసెన్స్ క్యాంప్ (మేళా) ఏర్పాటు చేయాలని ప్రజా పోరాట సమితి మరియు స్థానిక గ్రామస్తులు కోరారు. బుధవారం ఈ మేరకు ప్రజా పోరాట సమితి ప్రతినిధులు పేరూరు పోలీస్ స్టేషన్లో వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ప్రజా పోరాట సమితి సభ్యులు మాట్లాడుతూ.. పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో అత్యధికంగా నిరుపేద, గిరిజన మరియు వెనుకబడిన కుటుంబాల వారు నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడి ప్రజలు తమ రోజువారీ పనుల నిమిత్తం ఎక్కువగా ద్విచక్ర వాహనాలపైనే ప్రయాణిస్తుంటారని, అయితే అవగాహన లోపం మరియు ఆర్థిక ఇబ్బందుల వల్ల చాలా మందికి డ్రైవింగ్ లైసెన్సులు లేవని పేర్కొన్నారు. దీనివల్ల వాహన తనిఖీలలో నిరుపేదలు భారీగా చలానాలు కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి జిల్లా కేంద్రమైన ములుగు పట్టణానికి వెళ్ళాలంటే ఇక్కడి వారికి దూరం భారమవ్వడమే కాకుండా, ప్రయాణ ఖర్చులు మరియు రోజువారీ కూలి నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. కావున, స్థానిక ఎస్సై గారు చొరవ తీసుకుని రవాణా శాఖ ( ఆర్టీవో) అధికారులతో మాట్లాడి, పేరూరు ప్రాంతంలోనే ప్రత్యేక లైసెన్స్ మేళా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ క్యాంప్ నిర్వహణకు స్థానిక గ్రామస్తుల తరపున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. స్థానికంగానే లైసెన్స్ మేళా ఏర్పాటు చేయడం వల్ల చట్టాలపై ప్రజలకు గౌరవం పెరగడమే కాకుండా, రోడ్డు ప్రమాదాల నివారణకు కూడా దోహదపడుతుందని వారు ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రజా పోరాట సమితి అధ్యక్షులు ముత్తెబోయిన మహేందర్, కుమ్మరి శ్రీనాద్, గార రవి కుమార్ గ్రామ పెద్దలు మరియు స్థానిక యువకులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు.,

హుజూర్నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి



**హుజూర్నగర్ నియోజకవర్గ సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్** గుగులోతు పరిధిలోని నేరేడుచర్ల పట్టణం లోని ఌ1 ఏవన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన నేరేడుచర్ల, మండలం, పెంచికల్ దిన్న గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపిటిసి యల్లబోయిన లింగయ్య యాదవ్ - దుర్గమ్మ గార్ల ఏకైక పుత్రుడు భానుప్రకాష్ - తనూజ.. ల వివాహ మహోత్సవ కార్యక్రమానికి హాజరై,నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించిన.. బీఆర్ఎస్ పార్టీ హుజూర్ నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి గారు.. మరియు వారి వెంటఈ కార్యక్రమంలో.హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు,మాజీ జెడ్పిటిసి డా.కొప్పుల సైదిరెడ్డి, సీనియర్ నాయకులు ఐతీ.ఖూచీ రెడ్డి, డిసిసిబి మాజీ డైరెక్టర్,కౌన్సిలర్ దొండపాటి అప్పిరెడ్డి, హుజూర్నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, హుజూర్నగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, నేరేడుచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ చందమల్ల జయ బాబు,నేరేడుచర్ల మండల పార్టీ మాజీ అధ్యక్షుడు అరిబండి సురేష్,మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, బిఆర్ఎస్ నాయకులు గుర్రం మార్కండేయ, నాదెండ్ల శ్రీధర్ ,యూత్ నాయకులు వీరమల్ల సుందరయ్య, చిత్తలూరు సైదులు, ఇంజమూరి రాజేష్, మరియు పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద రహిత జిల్లానే లక్ష్యం -- జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి

**సీకే న్యూస్ ప్రతినిధి, వనపర్తి జిల్లా**

వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జిల్లా రవాణా అధికారి (డీటీఓ) సురేష్ కుమార్ జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డీటీఓకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ప్రాణ రక్షణే పోలీసు, రవాణా శాఖల ప్రధాన బాధ్యత అని అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, అధిక వేగాన్ని నియంత్రించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.

పోలీసు, రవాణా శాఖల సమన్వయంతో సురక్షిత రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి తన భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా కాపాడాలని ఎస్పీ సూచించారు.



బిజినెస్

# 300 నగరాలకు 'అమెజాన్ నౌ' విస్తరణ




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా 300 నగరాలకు తన క్విక్ కామర్స్ సర్వీస్ 'అమెజాన్ నౌ'ను విస్తరించనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ విస్తరణతో భారతదేశంలోనే అతిపెద్ద 'నిమిషాల్లో డెలివరీ' నెట్‌వర్క్‌ను నిర్మించాలన్న లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది. ప్రారంభించినప్పటి నుంచి ప్రతి త్రైమాసికంలో అమెజాన్ నౌ ఆర్డర్లు రెట్టింపు అవుతున్నాయని, దీంతో ఇది అమెజాన్ ఇండియా చరిత్రలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ-కామర్స్ వ్యాపార విభాగంగా నిలిచిందని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, పుణె, హైదరాబాద్, అమృత్‌సర్, కొచ్చి తదితర 15కు పైగా మెట్రో, నాన్-మెట్రో నగరాల్లో అమెజాన్ నౌ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే 5 కోట్లకు పైగా వినియోగదారులకు ఈ సేవ చేరువైంది. కిరాణా వస్తువులు, పండ్లు, కూరగాయలు, ఫ్రోజెన్ ఫుడ్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, ఫ్యాషన్, బ్యూటీ ఉత్పత్తులు, చిన్న గృహోపకరణాలు, కిచెన్ వస్తువులు తదితర వేలాది ఉత్పత్తులను నిమిషాల్లోనే వినియోగదారులకు అందిస్తోంది. భారత్ పర్యటనకు వచ్చిన కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ ముంబైలోని అమెజాన్ మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల అవసరాలను మరింత వేగంగా తీర్చేందుకు మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, అర్బన్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ల నెట్‌వర్క్‌ను విస్తరించాలని అమెజాన్ యోచిస్తోంది. ప్రస్తుతం లక్షల సంఖ్యలో ఉత్పత్తులను అదే రోజు లేదా మరుసటి రోజు డెలివరీ చేయగల సామర్థ్యాన్ని సంస్థ కలిగి ఉందని వెల్లడించింది. ఇదే సందర్భంగా డెలివరీ అసోసియేట్‌ల సంక్షేమం కోసం 'సమ్మాన్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా అమెజాన్ ప్రారంభించింది. ఇటీవల ప్రకటించిన 30 కోట్ల డాలర్ల పెట్టుబడిలో భాగాన్ని ఈ కార్యక్రమం విస్తరణకు వినియోగించనుంది. ఇందులో డెలివరీ సిబ్బంది పిల్లలకు విద్యా స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్య, జీవిత బీమా, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రాప్యత, ఆర్థిక చేరిక కార్యక్రమాలు, రోడ్డు భద్రతా చర్యలు వంటి పలు ప్రయోజనాలు అందించనున్నారు. అలాగే ఈ ఏడాదిలో 'ఆశ్రయ్' విశ్రాంతి కేంద్రాల సంఖ్యను 250కు పెంచి, పరిశ్రమలోని అన్ని డెలివరీ అసోసియేట్‌లకు అందుబాటులో ఉంచనున్నట్లు అమెజాన్ వెల్లడించింది.

# 'టాటా' భారీ ప్లాన్: అయిదేళ్లలో రూ.40,000 కోట్ల పెట్టుబడి

**న్యూఢిల్లీ:** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ (టీఎంపీవీ) వచ్చే అయిదేళ్లలో రూ.37,500 కోట్ల నుంచి రూ.40,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. 2031 ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై31) నాటికి దేశీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో 20 శాతం వాటాను సాధించడంతో పాటు వార్షిక విక్రయాలను ప్రస్తుత 6.4 లక్షల యూనిట్ల స్థాయి నుంచి 12 లక్షల యూనిట్లకు పైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇన్వెస్టర్ల సమావేశంలో టాటా మోటార్స్ ప్యాసింజర్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో శైలేష్ చంద్ర ఈ వివరాలను వెల్లడించారు.




**ఆరు కొత్త మోడళ్లు.. ఉత్పత్తి సామర్థ్యం పెంపు**

కంపెనీ ప్రస్తుతం ఏడాదికి 9 లక్షల వాహనాల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. రానున్న 2--3 ఏళ్లలో అదనంగా మరో 4 లక్షల యూనిట్ల సామర్థ్యాన్ని జోడించి మొత్తం ఉత్పత్తి సామర్థ్యాన్ని 13 లక్షల యూనిట్లకు పెంచనున్నట్లు శైలేష్ చంద్ర తెలిపారు. అలాగే ఎఫ్‌వై31 నాటికి ఆరు కొత్త మోడల్ శ్రేణులను మార్కెట్లోకి తీసుకురానుంది. దీంతో కంపెనీ మొత్తం మోడల్ శ్రేణుల సంఖ్య ప్రస్తుతం ఉన్న తొమ్మిది నుంచి 15కు చేరనుంది. అధిక వృద్ధి అవకాశాలు ఉన్న విభాగాలతో పాటు ఇప్పటివరకు ప్రవేశించని కొత్త ఈవీ విభాగాల్లోనూ ఈ మోడళ్లు అందుబాటులోకి రానున్నాయి.

**పోర్ట్‌ఫోలియోలో 30% ఈవీ వాటా లక్ష్యం**

భవిష్యత్తు అంతా మల?ట--పవర్‌ట్రెయిన్ (ఈవీ, సీఎన్‌జీ, పెట్రోల్/డీజిల్) దేనని శైలేష్ చంద్ర స్పష్టం చేశారు. ఎఫ్‌వై31 నాటికి టాటా మోటార్స్ తన సొంత పోర్ట్‌ఫోలియోలో 30 శాతం ఈవీ భాగస్వామ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 10 ఈవీ మోడళ్లను అందుబాటులోకి తీసుకురానుంది. రాబోయే రోజుల్లో కంపెనీ సాధించే అదనపు విక్రయాల్లో ఈవీ, సీఎన్‌జీ వాహనాలదే కీలక పాత్ర కానుంది. "ఎఫ్‌వై20 నుంచి ఎఫ్‌వై26 మధ్య కంపెనీ మార్కెట్ వాటా 9 శాతం పాయింట్లు పెరిగిందని, ఎఫ్‌వై26 నుంచి ఎఫ్‌వై31 మధ్య మరో 5--6 శాతం పాయింట్ల వృద్ధితో 20 శాతం మార్కెట్ వాటాను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాము" అని శైలేష్ చంద్ర తెలిపారు.

**ఆటో పరిశ్రమ అంచనాలు**

దేశీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్ ఎఫ్‌వై26 లోని 47 లక్షల యూనిట్ల నుండి ఎఫ్‌వై31 నాటికి 64 లక్షల యూనిట్లకు పెరుగుతుందని శైలేష్ చంద్ర అంచనా వేశారు. కొనుగోలుదారుల ఆదాయాలు పెరగడం, ఆధునిక సాంకేతికత తోడవ్వడంతో ప్రస్తుతం ఉన్న కార్ల సగటు ధర రూ.11--12 లక్షల నుండి ఎఫ్‌వై 31 నాటికి రూ.15 లక్షలకు చేరనుందన్నారు. దేశీయంగా ఈవీ విక్రయాలు ఎఫ్‌వై31 నాటికి 10.11 లక్షల యూనిట్లకు (మొత్తం మార్కెట్లో 15--20% వాటా) చేరుకుంటాయని అభిప్రాయపడ్డారు. కాగా, గత ఆర్థిక సంవత్సరంలో 2.2 లక్షలుగా ఉన్న ఈవీ విక్రయాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి 3.5 లక్షల యూనిట్లకు చేరుకోవచ్చని శైలేష్ చంద్ర తెలిపారు.

# భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు.. ఐటీ, బ్యాంకింగ్, రియల్టీ షేర్లలో బలంగా కొనుగోళ్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ రియల్టీ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో మార్కెట్లు లాభాల బాట పట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 790.54 పాయింట్లు లాభపడి 76,991.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ (చీఅట్ఎ) 197.55 పాయింట్లు పెరిగి 24,021.65 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సెషన్ ఆరంభం నుంచే మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ కనిపించింది. కీలక రంగాల్లో ఇన్వెస్టర్లు షేర్లను కొనుగోలు చేయడంతో సూచీలు మంచి లాభాలను నమోదు చేశాయి. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్ షేర్లు అత్యధికంగా లాభపడి టాప్



గెయినర్స్‌గా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ రియల్టీ సూచీలు రెండు శాతానికిపైగా లాభపడి మార్కెట్ ర్యాలీని నడిపించాయి. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా మంచి లాభాలను నమోదుచేశాయి. అయితే నిఫ్టీ ఆటో, నిఫ్టీ మెటల్ సూచీలు నష్టాలతో ముగిశాయి. లాభాల స్వీకరణ కారణంగా ఈ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.10 శాతం, స్మాల్‌క్యాప్ 0.39 శాతం స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. టెక్నికల్ నిపుణుల ప్రకారం.. నిఫ్టీకి 24,100 స్థాయివద్ద తక్షణ ప్రతిఘటన ఎదురవుతోంది. దీనిని అధిగమిస్తే బుల్లిష్ ట్రెండ్ కొనసాగి 24,200, ఆపై 24,400 స్థాయిలకు చేరే అవకాశం ఉంది. మరోవైపు 24,000 మార్క్ తక్షణ మద్దతుగా, 23,900-23,800 జోన్ కీలక సపోర్ట్‌గా పనిచేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# వన్డే బ్యాటర్లలో గిల్‌కు రెండో ర్యాంక్.. టెస్టు బౌలర్లలో బుమ్రాతో సమంగా హెన్రీ

**దుబాయ్:** మేటి వన్డే బ్యాటర్ల జాబితాను ఐసీసీ రిలీజ్ చేసింది. భారత కెప్టెన్ శుభమన్ గిల్ ఆ ర్యాంకుల్లో రెండో స్థానంలో నిలిచాడు. ఇక టెస్టు బౌలింగ్ ర్యాంకుల్లో టాప్ ప్లేస్‌లో ఉన్న జస్ప్రీత్ బుమ్రాకు సమంగా కివీస్ బౌలర్ మ్యాచ్ హెన్రీ వచ్చేశాడు. ఆ ఇద్దరూ ఇప్పుడూ టెస్టు బౌలింగ్ ర్యాంక్‌లో సమంగా ఉన్నారు. ఇక వన్డే బ్యాటింగ్‌లో కివీస్ బ్యాటర్ డారెల్ మిచెల్ తొలి స్థానంలో ఉన్నాడు. గిల్, మిచెల్ మధ్య 24 రేటింగ్ పాయింట్స్ తేడా ఉన్నది. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గిల్ అద్భుతంగా రాణించాడు. దీంతో అతని ర్యాంకు మెరుగుపడింది. ఇక ఆఫ్ఘన్‌తో జరిగిన మూడో వన్డేలో అతనికి బ్యాటింగ్ రాలేదు. ఆ మ్యాచ్‌లో ఇండియా 9 వికెట్ల తేడాతో నెగ్గింది. ఇక రెండు వన్డేల్లో అతను 84, 154 రన్స్ స్కోరు చేశాడు. ఇషాన్ కిషణ్ 21 స్థానాలను దాటి ప్రస్తుతం 43వ ర్యాంక్‌కు చేరుకున్నది. వన్డే బౌలర్లలో అర్షదీప్ సింగ్ 22, ప్రసిద్ధ కృష్ణ 58, వాషింగ్టన్ సుందర్ 71వ స్థానంలో ఉన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌లో ఆడని కోహ్లి ప్రస్తుతం మూడవ స్థానంలో ఉన్నాడు. ఇక రోహిత్ శర్మ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక టెస్టుల్లో కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ దూసుకొస్తున్నాడు. బుమ్రాతో కలిసి అతను నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించేశాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో అతను అద్భుతంగా బౌలింగ్ చేశాడు.



సుమారు 36 ఏళ్ల తర్వాత మళ్లీ కివీస్ బౌలర్ టాప్ ర్యాంకులో నిలిచాడు. గతంలో జాక్ కోవ్, రిచర్డ్ హాడ్లీ ఆ అగ్రస్థానానికి చేరుకున్నారు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో మ్యాట్ హెన్రీ 11 వికెట్లు తీసుకున్నాడు.

# మహిళా క్రికెట్‌కు భారీ బూస్ట్.. ఐసీసీ మార్గదర్శకాలపై సచిన్ హర్షం

మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన నూతన మార్గదర్శకాలపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తంచేశారు. ప్రసవానంతరం మహిళా క్రీడాకారిణులు తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు రూపొందించిన ఈ నిబంధనలు, మహిళా క్రికెట్‌కు భారీ ఊతమని ఆయన అభివర్ణించారు. మాతృత్వం, వృత్తిగత కెరీర్‌ను సమన్వయం చేసుకునేందుకు ఈ మార్గదర్శకాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఐసీసీ తాజాగా 'రిటర్న్ టు ప్లే పోస్ట్-ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్'ను విడుదల చేసింది. గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో, ప్రసవం తర్వాత క్రీడాకారిణుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరు దశల విధానాన్ని ఇందులో పొందుపరిచారు. ప్రపంచవ్యాప్తంగా మహిళా క్రికెటర్ల కోసం ఒక నిర్దిష్ట కార్యాచరణను రూపొందించడం ఇదే తొలిసారి. మాతృత్వం కారణంగా ఏ క్రీడాకారిణి కూడా తన దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతోనే ఈ మార్గదర్శకాలను తీసుకొచ్చినట్లు ఐసీసీ ఛైర్మన్ జై షా తెలిపారు. గతంలో చాలామంది క్రీడాకారిణులు కుటుంబ బాధ్యతల నిమిత్తం కెరీర్ మధ్యలోనే వీడ్కోలు పలకాల్సి వచ్చేది. ఈ నూతన విధానం ప్రతిభావంతులైన క్రీడాకా రిణులు ఆటలో సుదీర్ఘకాలం కొనసాగేందుకు తోడ్పడుతుందని ఆయన ఆకాంక్షించారు.



స్పోర్ట్స్

## శతక్కొట్టిన హర్షిత్ చౌదరి.. బోణీ కొట్టిన వరంగల్




తెలంగాణ టీ20 లీగ్-2026 (టీజీ20)లో మూడో శతకం నమోదైంది. వరంగల్ వారియర్స్ ఓపెనర్ హర్షిత్ చౌదరి శతక్కొట్టాడు. ఖమ్మం ఏసెస్‌తో బుధవారం నాటి మ్యాచ్‌లో 48 బంతుల్లో హర్షిత్ వంద పరుగుల మార్కు అందుకున్నాడు. అతడి శతక ఇన్నింగ్స్‌లో తొ మ్మిది ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి.

**వరంగల్‌కు తొలుత ఓటమి**

కాగా జూన్ 21న టీజీ20 లీగ్ మొదలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ వారియర్స్ కెప్టెన్ అమన్ రావు లీగ్‌లో తొలి సెంచరీ నమోదు చేశాడు. ఉప్పల్ వేదికగా సోమవారం మెదక్ ఫాల్కన్స్‌పై 32 బంతుల్లోనే శతక్కొట్టాడు. తద్వారా లీగ్‌లో మొట్టమొదటి సెంచరీని తన పేరిట లిఖించుకున్నాడు ఈ కరీంనగర్ అబ్బాయి. అయితే, ఆ వెంటనే మెదక్ సారథి తిలక్ వర్మ కూడా సెంచరీ చేసి.. లీగ్‌లో రెండో శతకం నమోదు చేయడంతో పాటు.. వరంగల్‌పై తన జట్టుకు విజయం అందించాడు.

**ఖమ్మం స్కోరు 202**

తాజాగా తమ రెండో మ్యాచ్‌లో భాగంగా ఖమ్మం ఏసెస్‌ను ఎదుర్కొన్న వరంగల్.. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం 19.2 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌట్ అయింది. ఖమ్మం బ్యాటర్లలో మయాంక్ గుప్త (54), మికిల్ జైస్వాల్ (54) అర్ధ శతకాలతో రాణించారు.

**చెలరేగిన హర్షిత్.. వరంగల్ బోణీ**

వరంగల్ బౌలర్లలో మహ్మద్ అబ్దుల్ మాలిక్, అభిషేక్ చెరో మూడు వికెట్లు కూల్చగా.. క్రాంతి పల్లెపాటి రెండు, హుసేన్ ఒక వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన వరంగల్ ఆదిలోనే కెప్టెన్ అమన్‌రావు (7) వికెట్ కోల్పోగా.. మరో ఓపెనర్ హర్షిత్ చౌదరి శతకంతో చెలరేగాడు. మొత్తంగా 62 బంతులు ఎదుర్కొన్న హర్షిత్ పదకొండు ఫోర్లు, ఏడు సిక్సర్ల సాయంతో 121 పరుగులు చేశాడు. మిగిలిన వారిలో రిషికేత్ సిసోడియా (27) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. ఇక ఆఖరి వరకు అజేయంగా నిలిచి సిక్సర్‌తో వరంగల్‌ను విజయతీరాలకు చేర్చాడు హర్షిత్ చౌదరి. ఫలితంగా 18.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన వరంగల్.. ఖమ్మంపై ఐదు వికెట్ల తేడాతో (208-5) విజయం సాధించింది. ఇక సీజన్‌లో వరంగల్‌కు ఇదే తొలి గెలుపు. టీమిండియా స్టార్ మహ్మద్ సిరాజ్ వరంగల్ జట్టుతో పాటు స్టేడియానికి వచ్చినప్పటికీ.. అతడు విశ్రాంతి తీసుకున్నాడు. తదుపరి మ్యాచ్‌లో వరంగల్ తరఫున సిరాజ్ బరిలో దిగనున్నాడు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# డిజిటల్ స్వాతంత్ర్యం

స్వాతంత్ర్యం పొందిన 78 ఏళ్ల తర్వాత కూడా.. భారత్ ఒక కొత్త పరాధీనతలో చిక్కుకుంటోందా? అని ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎందుకంటే, ఈ రోజు జరిగే యుద్ధాలు తుపాకులతో మాత్రమే కాదు.. సర్వర్లతో, సాఫ్ట్‌వేర్‌తో, డేటాతో కూడా జరుగుతున్నాయి. ఆధునిక ప్రపంచంలో డిజిటల్ మౌలిక సదుపాయాలు కేవలం సాంకేతిక సౌకర్యాలు కావు, అవి దేశ వ్యాపారం, పాలన, జాతీయ భద్రత నడిచే పట్టాలు. ఈ పట్టాలు ఎవరి అధీనంలో ఉన్నాయో.. అసలైన అధికారం వారి చేతుల్లోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో భారత్‌ను కలవరపెట్టే రెండు సంఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. 2026 ఏప్రిల్‌లో భారత్‌లోని క్లోజ్డ్ సర్క్యూట్ టెలివిజన్ నెట్‌వర్క్‌లు శత్రుశక్తులచే హ్యాక్ చేయబడి, దేశ వ్యూహాత్మక రక్షణ ఆస్తులకు సంబంధించిన సమాచారం చోరీకి గురైంది. దీనికి కారణం సీసీటీవీ పరికరాల్లో వినియోగించిన చైనా సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫారమ్ 'ఈజీ క్లౌడ్'. 2025 జూలైలో మరో ఘటన చోటుచేసుకుంది. భారత్‌లో పనిచేసే నయారా ఎనర్జీ సంస్థ తన కార్పొరేట్ ఈ-మెయిల్, సహకార సాధనాలు, క్లౌడ్ డేటాను అకస్మాత్తుగా కోల్పోయింది. కారణం? మైక్రోసాఫ్ట్ సంస్థ యూరోపియన్ యూనియన్ ఆంక్షలను అమలుపరిచింది. నయారాలో వాటా కలిగిన రష్యన్ దిగ్గజం రోస్‌నెఫ్ట్‌పై విధించిన ఈ ఆంక్షల కారణంగా భారతీయ సంస్థ మైక్రోసాఫ్ట్ సేవలను కోల్పోయింది. ఈ రెండు సంఘటనలూ ఒక అసౌకర్యమైన వాస్తవాన్ని బయటపెట్టాయి, భారత్ యొక్క కీలక డిజిటల్ మౌలిక సదుపాయాలు నేటికీ విదేశీ సాంకేతిక దిగ్గజాల అధీనంలోనే ఉన్నాయని. ప్రమాణీకరణ వ్యవస్థలు, ఉత్పాదకతా సాధనాలు, క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌లు.. ఇవన్నీ విదేశీ సంస్థలు సొంతపరచుకున్నవే. డేటా శారీరకంగా భారత్‌లో నిల్వ చేయబడినా.. విదేశీ క్లౌడ్ కంపెనీలు తమ సొంత దేశ ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆ డేటాను అప్పగించవలసి వస్తుంది. దీని అర్థం స్పష్టమే -డిజిటల్ నియంత్రణ భారతీయుల చేతుల్లో లేదు!

విదేశీ డిజిటల్ మౌలిక సదుపాయాలపై ఆధారపడడం వల్ల కలిగే ప్రమాదాలు అనేకం. విదేశీ సార్వభౌముల ఆదేశాల మేరకు భారత వ్యాపారాలు, ప్రభుత్వ సేవలు స్తంభించిపోవచ్చు. వాణిజ్యం కుప్పకూలవచ్చు. తయారీ రంగం నిలిచిపోవచ్చు. రక్షణ సామర్థ్యాలు బలహీనపడవచ్చు. ఇది కేవలం సైద్ధాంతిక హెచ్చరిక కాదు, ఇప్పటికే జరిగిన చరిత్ర. 1999 కార్గిల్ యుద్ధంలో కొండ ప్రాంతాల్లో లక్ష్యాలను ఛేదించడానికి జీపీఎస్ నావిగేషన్ అవసరమైన కీలక సమయంలో అమెరికా అవసరమైన స్థాయిలో ఆ సహాయాన్ని నిరాకరించింది. ఆ ఒక్క నిర్ణయం భారత సైన్యం ఎంత అశక్తంగా ఉందో చూపించింది. ఈరోజు యుద్ధాలు సాఫ్ట్‌వేర్‌తో నిర్వహించబడతాయి. యుద్ధ విమానాల తెలివితేటలు, క్షిపణి వ్యవస్థలు, అత్యాధునిక రాడార్ సదుపాయాలు.. వీటిలోని నిఘా కేవలం హార్డ్‌వేర్‌లో కాదు, విదేశీ ప్రభుత్వాలకు జవాబుదారీగా ఉండే కంపెనీల నియంత్రణలోని సాఫ్ట్‌వేర్ కోడ్‌లో ఉంటుంది. సంఘర్షణ పరిస్థితుల్లో ఆ కంపెనీలు ఇబ్బంది పెట్టవచ్చు. ఈ ముప్పును ప్రపంచం గుర్తించడం మొదలుపెట్టింది. ఫ్రాన్స్ 2027 నాటికి మైక్రోసాఫ్ట్ టీమ్స్, జూమ్‌లకు బదులుగా స్వదేశీ వీడియో కాన్ఫరెన్సింగ్ వేదికను అందుబాటులోకి తేనుంది. నెదర్లాండ్స్, డెన్మార్క్, జర్మనీలోని పలు రాష్ట్రాలు మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎక్సెల్, అవుట్‌లుక్, టీమ్స్‌లకు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నాయి. యూరోపియన్ యూనియన్ స్వతంత్ర క్లౌడ్, ఐటీ మౌలిక సదుపాయాల ద్వారా అమెరికన్ సాంకేతికతపై ఆధారపడటం తగ్గించుకోవడానికి కృషి చేస్తోంది. టర్కీ సైతం విదేశీ సాంకేతికతపై ఆధారపడడాన్ని తగ్గించుకుంటోంది. అయితే ఇతర దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. 'పవర్ ట్రాన్సిషన్ థియరీ' ప్రకారం.. ఒక అభ్యుదయ శక్తి స్థాపిత అగ్రశక్తిని సమీపించినప్పుడు, అగ్రశక్తి దాన్ని నిరోధించడానికి ప్రయత్నిస్తుంది. అమెరికా-చైనా మధ్య ఈ ప్రక్రియ ప్రత్యక్షంగా కనిపిస్తోంది. వేగంగా వృద్ధి చెందుతున్న భారత్ కూడా ఈ కీలక మండలంలోకి అడుగుపెడుతోంది. అందుకే సాంకేతిక స్వాతంత్ర్యం భారత్‌కు కేవలం అభిలాష మాత్రమే కాదు, అది జాతీయ మనుగడకు అనివార్యమైన అవసరం.

అయితే, భారత్ ఇప్పటికే ఈ దిశలో అడుగులు వేస్తోంది. కార్గిల్‌లో జీపీఎస్ నిరాకరణ సంఘటన దేశాన్ని స్వంత ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ నిర్మించేలా ప్రేరేపించింది. కొన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల ఈ మెయిల్ వ్యవస్థలను స్వదేశీ జోహో ప్లాట్‌ఫారమ్‌కు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీఐ, రూపే ద్వారా స్వదేశీ చెల్లింపు మౌలిక సదుపాయాలను సృష్టించడంలో భారత్ విజయం సాధించింది. ఇది ఒక మెరుగైన నమూనా. ఈ నమూనాను క్లౌడ్ మౌలిక సదుపాయాలు, ఈ-కామర్స్ వేదికలు, ప్రమాణీకరణ వ్యవస్థలు, రక్షణ సాంకేతికతలకు విస్తరించాలి. రక్షణ ఉత్పాదన రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం పెంచడం అత్యవసరం. అమెరికా మాదిరిగా ప్రభుత్వం పరిశోధన నిధులు, సేకరణ హామీలు అందించడం ద్వారా ప్రైవేట్ కంపెనీలు అత్యాధునిక సామర్థ్యాలు అభివృద్ధి చేసే వాతావరణం కల్పించాలి. అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ అభివృద్ధిలో ప్రైవేట్ రంగాన్ని పోటీ ప్రాతిపదికన ఆహ్వానించడం ఒక శుభసూచన. అంతర్జాతీయ సహకారమూ అవసరం. బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ వంటి ఉమ్మడి అభివృద్ధి నమూనాలు పరస్పర ఆధారపడటాన్ని సృష్టిస్తాయి. ఏకపక్ష చర్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. చైనాలాగా పూర్తిగా స్వదేశీ సాంకేతికతలకే పరిమితం కాకుండా, అంతర్జాతీయ సంబంధాలను కాపాడుకుంటూ సాంకేతిక సామర్థ్యాలు నిర్మించుకోవచ్చు. గుజరాత్ సనంద్‌లో మైక్రాన్ టెక్నాలజీ సెమీకండక్టర్ సదుపాయం ప్రారంభం, ఏఐ భద్రతపై పాక్స్ సిలికా కూటమిలో భారత్ చేరిక.. ఇవి సరైన దిశలో అడుగులు. అన్నింటికీ మించి, పరిశోధన, అభివృద్ధి వ్యయాన్ని మొత్తం దేశీయ ఉత్పత్తిలో 0.74 శాతంనుంచి గణనీయంగా పెంచాలి. ప్రపంచ సగటు 2.07 శాతంతో పోలిస్తే భారత్ చాలా వెనుకబడి ఉంది. భారత్ ప్రమాణాలు, ఆర్థిక వేగం, జనాభా పరిమాణం దృష్ట్యా ఇది అంగీకరించలేని లోటు. సాంకేతిక సార్వభౌమత్వాన్ని నిర్మించుకోవడం భారత్‌కు ఖర్చు భరించగలిగే విషయమా కాదా అని ప్రశ్నించుకోవద్దు.. బదులుగా దాన్ని విడిచిపెట్టడం భారత్‌కు నష్టదాయకమా కాదా అని ప్రశ్నించుకోండి. సమాధానం స్పష్టం. డిజిటల్ సార్వభౌమత్వం సాధించిన మేరకే భారత్ ఆర్థిక పోటీతత్వం, వ్యూహాత్మక స్వాతంత్ర్యం నిలబడతాయి!



# సముద్ర గర్భంలో చైనా సర్వర్లు!

కృత్రిమ మేధ యుగంలో డేటా సెంటర్లకు విద్యుత్ అవసరం విపరీతంగా పెరిగిపోతోంది. దీనికి పరిష్కారంగా చైనా ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే అడుగు వేసింది. షాంఘై తీరంలో సముద్రగర్భంలో పవన విద్యుత్‌తో నడిచే ప్రపంచ తొలి డేటా సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. విద్యుత్ వినియోగాన్ని 22.8 శాతం తగ్గిస్తూ, మంచినీటి వినియోగాన్ని పూర్తిగా తొలగించిన ఈ ఆవిష్కరణ సాంకేతిక రంగంలో కొత్త అధ్యాయానికి తెర తీసింది!

డిజిటల్ యుగంలో డేటా సెంటర్లు అపారమైన విద్యుత్‌ను, మంచినీటిని వినియోగిస్తున్నాయి. సంప్రదాయ భూ ఆధారిత డేటా సెంటర్లలో సర్వర్లను చల్లబరచడానికే మొత్తం విద్యుత్ వినియోగంలో 25నుంచి 40 శాతం వరకు వెచ్చించాల్సి వస్తోంది. 2030 నాటికి ఏఐ డిమాండ్ పెరగడంతో డేటా సెంటర్ల నీటి వినియోగం ఏటా 9.3 ట్రిలియన్ లీటర్లకు చేరవచ్చని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. ఈ సమస్యకు చైనా వినూత్న పరిష్కారం కనుగొంది.

షాంఘై లింగాంగ్ స్పెషల్ ఏరియాలో 22.6 కోట్ల డాలర్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు 2025 జూన్‌లో అధికారికంగా ప్రారంభమై, అక్టోబర్‌లో నిర్మాణం పూర్తైంది. 2.3 మెగావాట్ల ప్రదర్శన సదుపాయంతో మొదలై రెండు దశలలో మొత్తం 24 మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించింది. సర్వర్లు ఒత్తిడి తట్టుకునే మాడ్యూళ్ళలో సముద్ర ఉపరితలానికి దాదాపు 35 మీటర్ల లోతులో అమర్చబడ్డాయి. 95 శాతానికి పైగా విద్యుత్ సమీపంలోని పవన టర్బైన్ల నుంచే వస్తోంది.

సముద్రమే శీతలీకరణ యంత్రం

చుట్టూ ఉన్న సముద్రపు నీటినే ఉష్ణగ్రాహకంగా ఉపయోగించుకుంటూ రాగి పైపుల వేడి మార్పిడి వ్యవస్థ ద్వారా విద్యుత్ వినియోగాన్ని 22.8 శాతం తగ్గించింది. మంచినీటి వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించింది. భూమిపై అవసరమయ్యే స్థలాన్ని 90 శాతానికి పైగా తగ్గించింది.


చైనా టెలికాం జీపీయు క్లస్టర్లను అమర్చిన దాదాపు 2,000 సర్వర్లు కృత్రిమ మేధ, బిగ్ డేటా అనోటేషన్, స్వదేశీ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ అభివృద్ధి, 5+ మౌలిక సదుపాయాల వంటి అత్యాధునిక పనులకు సేవలందిస్తున్నాయి. భవిష్యత్తులో హైక్లౌడ్ సంస్థ 500 మెగావాట్ల సామర్థ్యానికి ఈ ప్రాజెక్టును విస్తరించే ప్రణాళిక కలిగి ఉంది.

మైక్రోసాఫ్ట్ 'ప్రాజెక్ట్ నాటిక్' పేరుతో 2015లో కాలిఫోర్నియా తీరంలో, 2018లో స్కాట్లాండ్‌లో పరీక్షలు నిర్వహించి 2024 నాటికి వాణిజ్య విస్తరణ లేకుండా నిలిపివేసింది. అయితే చైనా హైక్లౌడ్ సంస్థ లింగాంగ్ ప్రాజెక్టు ద్వారా వాణిజ్యస్థాయిలో ఆఫ్‌షోర్ విండ్‌తో సముద్రగర్భ డేటా సెంటర్‌ను మొట్టమొదటిసారి విజయవంతంగా అమలు చేసింది.

ఈ విప్లవాత్మక ఆవిష్కరణకు సవాళ్లూ ఉన్నాయి. సముద్రపు ఉప్పు నీరు పైపులను తినివేయవచ్చు. నిర్వహణ ఖర్చులు అధికంగా ఉండవచ్చు. దీర్ఘకాలిక నిర్వహణ ఖర్చులు, వివిధ వాతావరణాలలో విస్తరణ సాధ్యాసాధ్యాలు, ప్రభుత్వ మద్దతు లేకుండా ఆర్థిక లాభదాయకత సాధ్యమవుతుందా అనే ప్రశ్నలు ఇంకా సమాధానానికి నోచుకోలేదు. పర్యావరణ నిపుణులు సముద్ర జీవావరణ వ్యవస్థలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని పర్యవేక్షించాలని సూచిస్తున్నారు. సముద్రం కేవలం చేపలకు మాత్రమే నివాసం కాదు, రేపటి డిజిటల్ ప్రపంచానికి సర్వర్ల నిలయంగా మారనుంది. చైనా ఆ భవిష్యత్తుకు నేడే తెర తీసింది!

# వాయిదాలొద్దు.. దేనికైనా!

కలలు కనడం సులభమే -కానీ వాటిని సాకారం చేసుకోవడానికి ఈరోజే పని మొదలుపెట్టాలి! 'రిచ్ డాడ్.. పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి చెప్పినట్టు -భవిష్యత్తు రేపటి ప్రణాళికలతో కాదు, నేటి చర్యలతోనే నిర్మితమవుతుంది. వాయిదా అనే అలవాటు విజయానికి అతిపెద్ద శత్రువు. అది అవకాశాలను మింగేసి, లక్ష్యాలను దూరం చేస్తుంది. కాబట్టి ఆగకండి, ఆలోచించకండి.. ఇప్పుడే మొదలుపెట్టండి, ఇప్పుడే మారండి!



ఒక విద్యార్థి -రేపు చదువుదాం అనుకుంటాడు. నష్టాల్లోవున్న వ్యాపారి "రేపటినుంచి మారాలి" అనుకుంటాడు. ఒక యువకుడు "రేపటినుంచి అవకాశం వెతుక్కోవాలి' అనుకుంటాడు. వీళ్ళందరికీ -ఆ రేపు ఎప్పటికీ రాదు. ఎందుకంటే.. రేపు అనే పదానికి 'ఈరోజు' తప్ప వేరే అర్థం లేదు. ఈ సత్యాన్ని ప్రపంచానికి చాటిన వ్యక్తి -రాబర్ట్ టి కియోసాకి. 'రిచ్ డాడ్.. పూర్ డాడ్' పుస్తకంతో లక్షలాది జీవితాలను మార్చిన అమెరికన్ వ్యాపారవేత్త. "మీ భవిష్యత్తు.. మీరు ఈరోజు చేసే పనుల ద్వారా నిర్మితమవుతుంది, రేపు చేసే వాటి ద్వారా కాదు" -అన్నది ఆయన చేసిన హెచ్చరిక! ఈ వాక్యం సాధారణంగా అనిపించవచ్చు. కానీ లోతుగా ఆలోచిస్తే -ఇది ఒక్కో మనిషి జీవితంలో ఒక్కో మోతాదులో మోదుగు కర్రలా తాకుతుంది.

**వాయిదా -అందమైన మోసం**

మనిషి మనసు తెలివైనది. తనను తాను సమర్థించుకోవడంలో అది ఎక్స్‌పర్ట్. "ఈ వేసవి కాలం పోనీ చదువుతా", "ఈ పండుగలు అయిపోనీ వ్యాపారం మొదలెడతా", "కొంచెం డబ్బు వస్తే పొదుపు మొదలెడతా" -ఇవన్నీ మనసు చెప్పే తీయని అబద్ధాలు. వాస్తవమేమిటంటే -వేసవి వెళ్లి శీతాకాలం వస్తుంది. పండుగలు పూర్తై, మళ్లీ వస్తాయి. డబ్బు వచ్చి ఖర్చయిపోతుంది. కానీ ఆ వాయిదా మాత్రం ఏ కాలంలోనూ తీరదు. అది మన జీవితకాలపు అలవాటుగా మారిపోతుంది. కియోసాకి ఈ విషయాన్ని తన జీవితంలో ముందే గ్రహించాడు. సమాజంలో పేదవారు వేచి చూస్తారు. సంపన్నులు ఇప్పుడే పని మొదలుపెడతారు -అని అతను గమనించాడు. వాయిదా అనేది సామాన్యుడికి అలవాటు, సక్సెసార్‌కు అది తెలియని పదం!

**ఈరోజు ఏంచేస్తున్నారు?**

ఒక రైతు విత్తనం వేయకుండా పంటను ఆశించలేడు. ఒక ప్లేయర్ ప్రాక్టీస్ చేయకుండా పతకాన్ని కోరుకోలేడు. ఒక విద్యార్థి చదవకుండా ర్యాంకు ఊహించలేడు. ఇది అందరికీ తెలిసిన సత్యమే. కానీ అందరూ పాటించే సత్యం కాదు. మీరు ఈరోజు సమయాన్ని ఎక్కడ పెట్టుబడి పెడుతున్నారు? సోషల్ మీడియా స్క్రోలింగ్‌లోనా? అర్థంలేని సంభాషణలలోనా? లేదా మీ లక్ష్యానికి దగ్గర చేసే పనులలోనా? రేపటి విజయానికి బీజం ఈరోజే పడుతుంది. రేపటి వైఫల్యానికి కారణం కూడా ఈరోజే మొదలవుతుంది. మీరు ఇప్పుడు ఎంచుకుంటున్న మార్గమే -రేపు మీరు నిలబడే స్థానాన్ని నిర్ణయిస్తుంది.

**చిన్న అడుగులు, పెద్ద ఫలితాలు**

మహా సముద్రం ఒక్కసారిగా నిండలేదు. వందల నదులు నిత్యం వచ్చి కలుస్తేనే అది అంత విశాలంగా నిలిచింది. మన విజయాలు కూడా అంతే, ఒక్కరోజులో సాధించేవి కావు. ప్రతి రోజు చేసే చిన్న చిన్న పనులే కాలక్రమంలో పెద్ద ఫలితాలుగా రూపాంతరం చెందుతాయి. రోజూ ఒక పేజీ చదివే అలవాటు -ఏడాదిలో పది పుస్తకాలవుతుంది. రోజూ వంద రూపాయలు పొదుపు చేసే అలవాటు -పదేళ్ళలో లక్షలవుతుంది. రోజూ ముప్పై నిమిషాలు నైపుణ్యం నేర్చుకునే అలవాటు -ఐదేళ్ళలో నిపుణుడిని తయారుచేస్తుంది. కియోసాకి సూత్రం ఇక్కడే మెరిసిపోతుంది -నేటి అలవాట్లే రేటి అదృష్టం!!

**పరిపూర్ణత కాదు, కొనసాగింపు కావాలి**

చాలామంది చేసే పొరపాటు ఏమిటంటే -"సరిగ్గా మొదలుపెట్టాలి, లేకపోతే మొదలుపెట్టనే మొదలుపెట్టం" అంటారు. ఫలానా పుస్తకం కొంటే చదువుతా, ఫలానా కోర్సులో చేరితే నేర్చుకుంటా -ఇవన్నీ ప్రారంభాన్ని వాయిదా వేయడానికి సృజించే సాకులే.

గెలుపు సాధకులు పరిపూర్ణంగా ప్రారంభించరు, వారు ప్రారంభించి పరిపూర్ణత సాధిస్తారు. తప్పులతో, అనుభవంతో, పడిలేస్తూ ముందుకు సాగడమే వారి రహస్యం. ఈరోజు చేసే అసంపూర్ణమైన ప్రయత్నం, రేపు చేయబోయే పరిపూర్ణమైన ప్రణాళికకంటే వేయి రెట్లు విలువైనది.

**మీ జీవితానికి మీరే బాధ్యులు**


"పరిస్థితులు సరిగ్గా లేవు", "అవకాశాలు రావడం లేదు", "సమాజం సహకరించడం లేదు" -ఇవన్నీ బాధ్యతనుంచి తప్పించుకోవడానికి మనం చెప్పుకునే మాటలు. నిజమే, పరిస్థితులు అందరికీ అనుకూలంగా ఉండవు. కానీ అదే పరిస్థితులలో కొందరు ఎదుగుతారు, కొందరు కుంగిపోతారు. తేడా పరిస్థితులలో కాదు -స్పందనలో ఉంటుంది. కష్టమైన పరిస్థితిలోనూ ఏమి చేయగలమో అది మన చేతిలోనే ఉంటుంది. ఆ ఒక్క చిన్న చర్య -మన మొత్తం భవిష్యత్తును తిప్పికొట్టే శక్తిని కలిగి ఉంటుంది.

**నేటి నిర్ణయమే రేపటి ఫలితం**

విద్యార్థులకైనా, ఉద్యోగులకైనా, వ్యాపారవేత్తలకైనా -కియోసాకి సూత్రం ఒకేవిధంగా వర్తిస్తుంది. ఎందుకంటే ఇది పదవులకు, వయస్సుకు, స్థాయికి అతీతమైన మానవ సత్యం! పరీక్షలకు ఈరోజే సిద్ధమవ్వండి. కొత్త నైపుణ్యాన్ని ఈరోజే నేర్వడం మొదలుపెట్టండి. పొదుపు అలవాటును ఈరోజే ప్రారంభించండి. కుటుంబంతో, మిత్రులతో బంధాన్ని ఈరోజే బలోపేతం చేసుకోండి. "రేపటినుంచి" అనే మాటను మీ నిఘంటువునుంచి తొలగించండి. దాని స్థానంలో "ఇప్పుడే" అనే పదాన్ని అమర్చండి.

**గడియారం ఆగదు!**

సమయం ఎవరికోసమూ ఆగదు. రాజుల కోసమూ కాదు, పేదల కోసమూ కాదు. విజ్ఞులకోసమూ కాదు, అజ్ఞానుల కోసమూ ఆగదు. అది నిరాఘాటంగా ముందుకు పోతూనే ఉంటుంది. ఆ వెళ్ళిపోయే ప్రతి క్షణంలో మీరు మీ భవిష్యత్తును నిర్మిస్తున్నారు, తెలుసుకున్నా, తెలియకపోయినా. ఉత్పాదకంగా గడిపితే విజయాన్ని, నిర్లక్ష్యంగా గడిపితే పశ్చాత్తాపాన్ని నిర్మిస్తున్నారు. కియోసాకి చెప్పిన మాట మళ్లీ గుర్తు చేసుకోండి -"మీ భవిష్యత్తు ఈరోజు మీరు చేసే పనుల వల్లే నిర్మితమవుతుంది". కాబట్టి ఈ క్షణం నుంచే -ఒక్క అడుగు వేయండి. చిన్నదైనా పర్వాలేదు. నిదానమైనా ఫర్వాలేదు. కానీ ఆగకండి, వాయిదా వేయకండి. ఎందుకంటే -మీ రేపటి మీరు, ఈరోజటి మీ చేతుల్లో ఉన్నారు! ■



మీ ఫోన్లో వచ్చే నోటిఫికేషన్లను ఎంతగా నియంత్రించగలిగితే, అవసరమైన విషయాల కోసం మీ మెదడులో అంత ఎక్కువ స్థలం అందుబాటులోకి వస్తుంది. మీ దృష్టిని మరల్చే, సమయాన్ని వృథా చేసే ప్రతి చిన్న విషయాన్ని జీవితం నుంచి నిర్మొహమాటంగా తొలగించండి. ఎందుకంటే, మీ దగ్గరున్న అత్యంత విలువైన సంపద డబ్బు కాదు, పేరు కాదు -అది కేవలం 'ఏకాగ్రత' మాత్రమే! మీరు ఆ ఏకాగ్రతను ఎక్కడ వెచ్చిస్తున్నారు, దేనిపై కేంద్రీకరిస్తున్నారు అనేదే మీ భవిష్యత్తును మలుపుతుంది, మీ విజయాన్ని నిర్ణయిస్తుంది. కాబట్టి.. దృష్టి సారించండి, గమ్యం చేరండి!

-మహాదేవ

వింతల్లో వింతలు

# గొర్రె కవచం!



ఆస్ట్రియాలోని ఫిల్లాఖ్ నగరానికి చెందిన రుడాల్ఫ్ స్కాబాచ్ అనే ఆవిష్కర్త, తోడేళ్ల దాడులనుంచి గొర్రెలను కాపాడటానికి ప్రత్యేకంగా 'చెయిన్ మెయిల్' కవచాన్ని రూపొందించాడు. ఆస్ట్రియా, జర్మనీలలో పెరుగుతున్న తోడేళ్ల దాడులే అతనికి స్ఫూర్తి. పదునైన ముళ్ళతో కూడిన తేలికైన ప్లాస్టిక్ వలను రూపొందించాడు. తోడేలు కరిచినప్పుడు నొప్పి కలిగి మళ్లీ ప్రయత్నించకుండా వెళ్ళిపోతుందని అతని నమ్మకం. "తోడేలు తెలివైన జంతువు, రెండోసారి కరవదు" అని అతను చెప్పాడు. అయితే ఈ ఆవిష్కరణ వివాదాస్పదమైంది. వేయి గొర్రెలు పెంచే కాపరి, ఈ కవచాన్ని హానికరమైనదిగా తిరస్కరించాడు. రాను రాను గొర్రె వెంట్రుకలు వలలో చిక్కుకుంటాయని, తోడేలు కాళ్లు-తలపై దాడి మారుస్తుందని హెచ్చరించాడు. వేలాది గొర్రెలకు ఈ కవచాలు ధరించడం ఆర్థికంగా సాధ్యం కాదని నిపుణులు కూడా అభిప్రాయపడ్డారు. విమర్శలకు తగ్గకుండా పరిశోధన కొనసాగిస్తున్నాడు రుడాల్ఫ్.




## 'స్పిరిట్'లోకి వివేక్..!

ప్రభాస్ స్టార్ లైనప్‌లో భారీ అంచనాలున్న సినిమా 'స్పిరిట్'. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న సినిమా ఓ పవర్ ఫుల్ కాప్ స్టోరీగా ప్రచారంలో ఉంది. ప్రభాస్‌కు పెయిర్‌గా త్రిప్తి దిమ్రి నటిస్తోంది. ఆసక్తికరమైన వార్తలతో స్పిరిట్ మళ్లీ వైరల్‌లోకి వచ్చింది. సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ నటించబోతున్నట్టు టాక్. సినిమా కొత్త షెడ్యూల్‌లో ఆయన జాయిన్ అవుతారట. ప్రస్తుతం కొత్త షెడ్యూల్ కోసం భారీ సెట్ డిజైన్ చేస్తున్నారు. కాగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న సినిమాలో యాక్షన్ ఎపిసోడ్స్ అద్భుతమన్న టాక్ బలంగ వినిపిస్తోంది. ఇప్పటికే, విడుదలైన పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ బజ్‌ని క్రియేట్ చేసింది. ప్రభాస్ లుక్ కూడా పక్కా వైల్డ్ అండ్ మాస్ అవతార్‌లో ఉంది. కాగా మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్‌తో సందీప్ రెడ్డి మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా పూర్తి చేశాడు. ఈ చిత్రాన్ని టి-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. 'స్పిరిట్' కోర్ కంటెంటే కొత్తగా ఉంటుందని.. సందీప్‌రెడ్డి వంగా నుంచి మరో వినూత్న సినిమా రానుందన్న ఎక్స్‌పెక్టేషన్స్ చాలాకాలంగా ఉన్నవే.

## కంబ్యాక్ కోసం కార్తీ మాస్టర్ ప్లాన్

కమర్షియల్ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న కార్తీ.. తన మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ 'సర్దార్-2'తో సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానున్నారు. పీఎస్ మిత్రన్ డైరెక్ట్ చేస్తున్న భారీ ప్రాజెక్ట్‌లో ఆషికా రంగనాథ్ హీరోయిన్. ఎస్‌జే సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. తమిళం, తెలుగుతో సహా పలు భాషల్లో ఒకేసారి చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. స్టార్ హీరో కార్తీ అభిమానులకు ఇది నిజంగా సాలిడ్ న్యూసే. తనకంటూ ప్రత్యేకమైన మార్కెట్ క్రియేట్ చేసుకున్న టాలెంటెడ్ యాక్టర్, ఇప్పుడు 'సర్దార్-2' రూపంలో బాక్సాఫీస్ వద్ద భారీ కంబ్యాక్ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఇటీవల కార్తీ నటించిన 'వా వాతియార్' సినిమా థియేటర్లతోపాటు ఓటీటీలో కూడా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. దీంతో తన ఆశలన్నీ ఈ యాక్షన్ సీక్వెల్‌పైనే పెట్టుకున్నారు. అభిమానుల నిరీక్షణకు తెరదించుతూ మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాను సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. పాన్ ఇండియా లెవల్‌లో తెలుగు, తమిళంతోపాటు ఇతర భాషల్లో ఒకేసారి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన ఫస్ట్ పార్ట్‌ను డైరెక్ట్ చేసిన మిత్రన్.. సీక్వెల్‌ను మరింత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ప్రాజెక్టుకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. రిలీజ్ డేట్‌పై ఫుల్ క్లారిటీ వచ్చేయడంతో ఫ్యాన్స్ కూడా ఖుషీ అవుతున్నారు. ఇక రాబోయే వారాల్లో ప్రమోషనల్ ఈవెంట్స్ స్టార్ట్ చేసి, వరుస అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు పెంచేందుకు టీమ్ ప్లాన్ చేస్తోంది. బాక్సాఫీస్ దగ్గర సర్దార్ సృష్టించిన మ్యాజిక్‌ను.. రెండో భాగం రిపీట్ చేస్తుందేమో చూడాలి.



## హాట్ స్టార్!




## ఆ.. కుటుంబంలో కన్నడ హీరో

విక్టరీ వెంకటేశ్ హీరోగా స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న ఆదర్శకుటుంబం చిత్రంపై భారీ అంచనాలున్నాయి. ఇక ఈ సినిమా అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వినిపిస్తున్న రూమర్ ప్రకారం.. సినిమాలో ఓ సీనియర్ హీరో గెస్ట్ రోల్‌లో నటించనున్నట్టు తెలుస్తోంది. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే సీన్స్‌లో ఈ పాత్ర చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుందని.. ఈ పాత్రలో కన్నడ హీరో సుదీప్ నటిస్తాడని టాక్ నడుస్తోంది. మరి ఈ వార్తలో ఎంత వాస్తవం ఉందో చూడాలి. అన్నట్టు ఈ సినిమాలో ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో పాటు ఫుల్ కామెడీ సీక్వెన్సెస్ కూడా ఉంటాయని తెలుస్తోంది. ఇక నాణ్యత విషయంలో త్రివిక్రమ్ ఎక్కడా రాజీ పడటం లేదు. అనుకున్న సమయానికే సినిమాను పూర్తి చేసి అందించాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' తదితర చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పని చేశారు. ఈ కాంబినేషన్‌లో మూవీని ప్రకటించినప్పటి నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. కాగా నిర్మాణ సంస్థ హారికా అండ్ హాసిని క్రియేషన్స్ ఈ సినిమాను భారీస్థాయిలో నిర్మించబోతుంది. మరి ఈ సినిమా ఏ స్థాయిలో విజయాన్ని సాధిస్తుందో చూడాలి.




## అందుకే.. సంకోచిస్తున్నా

వేదికపై మాట్లాడాలంటే ప్రస్తుతం తాను సంకోచిస్తున్నట్టు అగ్ర కథానాయకుడు రజనీకాంత్ చెప్పారు. ఏం మాట్లాడినా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. రజనీకాంత్ ప్రధాన పాత్రలో అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ఓ సినిమా రానున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. కమల్ హాసన్ నిర్మాతగా వ్యవహరిస్తోన్న సినిమాలో సిమ్రాన్, రాశిఖన్నా కథానాయికలు. నేడు సినిమా టైటిల్ రివీల్ ఈవెంట్‌ను నిర్వహించారు. 'ధర్మన్' పేరును ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో రజనీకాంత్ మాట్లాడుతూ.. "వేదికపైకి పిలవగానే మాట్లాడటానికి ప్రస్తుతం సంకోచిస్తున్నాను. నేను ఏం మాట్లాడినా.. అదో సమస్య అవుతోంది. అది నాతోపాటు ఇతరులకూ ఇబ్బంది కలిగిస్తోంది. మాట్లాడకపోతే... ఎందుకు మాట్లాడటం లేదని అడుగుతారు. మాట్లాడితే, ఇప్పుడే ఎందుకని అంటారు. మౌనంగా ఉండొచ్చు కదా అని మరికొందరు సూచిస్తారు. మనల్ని ఇష్టపడని వారికి మనం ఏంచేసినా నచ్చదని.. ఇవన్నీ విన్నాక నాకు అర్థమైంది" అని అన్నారు. ఈ ప్రాజెక్ట్కు అశ్వత్ మారిముత్తు నాలుగో దర్శకుడని రజనీకాంత్ తెలిపారు. దీని వెనక కారణాన్ని వివరించారు. "మొదట ఈ ప్రాజెక్టును దర్శకుడు రవికుమార్‌తో చేయాలనుకున్నాం. కొన్ని కారణాల వల్ల కుదర్లేదు. తర్వాత సుందర్ని ఎంపిక చేశాం. ఆయనకు ఇతర ప్రాజెక్టులు ఉండడంతో వైదొలిగారు. ఆ తర్వాత శిబి చక్రవర్తిని ఖరారు చేశాం. ఆయన మాకు వేరే కథ వినిపించారు. చివరకు అశ్వత్‌తో సినిమాను ఖరారు చేశాం" అని వెల్లడించారు.



## మెగాస్టార్‌తో మరో మెగా హీరో



మెగాస్టార్ చిరంజీవి సినిమాలో మరో హీరో కనిపించబోతున్నాడని టాక్ నడుస్తోంది. చిరంజీవి, బాబీ కొల్లి కాంబినేషన్‌లో ఓ సినిమా రానుంది. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కనున్న సినిమాపై క్రేజీ అప్‌డేట్ బలంగా వినిపిస్తోంది. సినిమా క్లైమాక్స్‌లో గెస్ట్ రోల్ ఉందని.. ఆ రోల్లో మరో మెగా హీరో సాయి దుర్గా తేజ్ కనిపించబోతున్నాడని టాక్. ఇక ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో వచ్చే ఫ్లాష్ బ్యాక్ కోసం మెగాస్టార్ సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నాడు. పైగా ఈ సినిమాలో మెగాస్టార్ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయట. అలాగే, ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడా ప్రత్యేకంగా ఉంటుందట. చిరును కొత్తగా చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ కథ రాసుకున్నారట బాబీ. కాగా ఈ సినిమాని నిర్మాతలు వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కాగా గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన వాల్తేరు వీరయ్య మంచి విజయం సాధించింది.

## చనిపోయే వరకూ నటిస్తూనే ఉండాలని కోరుకుంటున్నా: అక్షయ్ కుమార్

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ తన 35 ఏళ్ల సినీ కెరీర్‌లో అతిపెద్ద పశ్చాత్తాపాన్ని పంచుకున్నారు. 'వెల్కమ్ టు ది జంగిల్' విడుదలకు సిద్ధమవుతున్న వేళ.. ఇటీవల ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "చిత్రపరిశ్రమలో 35 ఏళ్లు కొనసాగడం అంటే చాలా పెద్ద విషయం.
ఎంతోమందిలో ఒక్కరికే ఆ అవకాశం వస్తుంది.
నేను ఇంకో 40 ఏళ్లు పూర్తి చేసుకోవాలని కోరుకుంటున్నా. డబ్బు సంపాదించడం కోసమే పరిశ్రమకు వచ్చాను. కానీ, ఇప్పుడు మాత్రం నటన నాలో భాగమైపోయింది. చనిపోయే వరకూ నటిస్తూనే ఉండాలని కోరుకుంటున్నా. ఒకప్పుడు వరుసగా ఒకే జానర్ సినిమాల్లో నటించాను. వెనక్కి తిరిగి చూసుకుంటే విభిన్నంగా ఎంచుకోనందుకు నాపై నాకే కోపం వచ్చింది. యాక్షన్ పాత్రలు మాత్రమే చేస్తానని అందరూ అనుకున్నారు. దీంతో కొత్త కథలపై దృష్టిపెట్టా.. 'టాయిలెట్ ఏక్ ప్రేమ్ కథ', 'ప్యాడ్ మ్యాన్' లాంటి విభిన్న చిత్రాలు చేశా.
కొందరు ఏడాదికి ఒక సినిమా చాలు అంటారు. కానీ నేను ప్రతిరోజూ పనిచేయాలనుకుంటా. ఫలితం ఆశించకుండా ఏడాదికి కనీసం నాలుగు సినిమాలు చేయడం నా బాధ్యతగా భావిస్తున్నా" అని అక్షయ్ స్పష్టం చేశారు. అక్షయ్ నటించిన 'వెల్కమ్ టు ది జంగిల్' జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'భూత్ బంగ్లా' తర్వాత ఈ ఏడాదిలో ఆయన నుంచి వస్తున్న రెండో చిత్రమిది. అహ్మద్ ఖాన్ దర్శకత్వం వహించిన ఈ కామెడీ ఎంటర్టైనర్లో రవీనా టాండన్, దిశా పటానీ తదితరులు నటించారు.



## ఆమెకు ఆ సత్తా ఉంది!

సమంత ప్రధానపాత్రలో తెరకెక్కిన చిత్రం 'మా ఇంటి బంగారం' మంచి ఆదరణ సొంతం చేసుకుంటూ.. ఐదు రోజుల్లోనే రూ.50 కోట్లు సాధించింది. సినిమా విజయంపై సమంత భర్త రాజ్ నిడిమోరు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. సమంత సత్తాను తక్కువగా అంచనా వేశారన్నారు. "మా ఇంటి బంగారం' విడుదలకు ముందు మా చిత్రబృందం ఇండస్ట్రీకి చెందిన ఒక వ్యక్తిని కలిసింది. సినిమాపై పబ్లిక్ టాక్ గురించి అడిగింది. ఆయన చెప్పిన దానికి మేం ఆశ్చర్యపోయాం.

'ఎవరూ ఏం మాట్లాడుకోవడం లేదు. అయినా.. మహిళా ప్రాధాన్యత చిత్రాలపై అంచనాలుండవు. థియేటర్లోకి వచ్చాక బాగుంటే చూస్తారు.. లేదంటే లేదు అని చెప్పారు. ఆ సమయంలో ఆయన మాటలు కఠినంగా అనిపించినా నిజమే కదా అనుకున్నాం. కానీ, మొదటి రోజు వసూళ్లు వచ్చాక మాకు ఒక విషయం అర్థమైంది. థియేటర్లకు జనాలను భారీగా తీసుకువచ్చే కెపాసిటీ సమంతకు ఉందని ఈ ఓపెనింగ్స్ మరోసారి గుర్తుచేశాయి" అని రాజ్ అన్నారు.

